మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

బుధవారం 29-07-2026
పేజీలు: 8 వెల: రూ.2/-

సంపుటి:5 సంచిక 255

Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District

విలేకరులు కావలెను




తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609



# దేశంలో అత్యంత ధనిక సీఎం డీకే శివకుమార్

- బిలియనీర్ సీఎంల జాబితాలో నలుగురు
- చంద్రబాబు ఆస్తులు రూ.931 కోట్లు.. విజయ్‌కు రూ.648 కోట్లు
- 31 మంది సీఎంల ఆస్తుల విలువ రూ.3,660 కోట్లు
- 14 మంది ముఖ్యమంత్రులపై క్రిమినల్ కేసులు
- రేవంత్‌రెడ్డిపై అత్యధికంగా 89 కేసులు
- శివకుమార్, చంద్రబాబుపై చెరో 19 క్రిమినల్ కేసులు
- ఒమర్ అబ్దుల్లా, సువేందు అధికారికి తక్కువ ఆస్తులు
- ఎన్నికల అఫిడవిట్ల ఆధారంగా ఏడీఆర్ నివేదిక

3

**రూ.1,413 కోట్ల ఆస్తులతో కర్ణాటక సీఎం టాప్**

దేశంలోని 31 మంది ముఖ్యమంత్రుల ఆస్తులపై ఏడీఆర్ విడుదల చేసిన నివేదిక ఆసక్తికర విషయాలను వెలుగులోకి తెచ్చింది. కర్ణాటక సీఎం డీకే శివకుమార్ రూ.1,413 కోట్ల ఆస్తులతో దేశంలోనే అత్యంత సంపన్న ముఖ్యమంత్రిగా నిలవగా, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు రూ.931 కోట్లతో రెండో స్థానంలో ఉన్నారు. మరోవైపు 14 మంది ముఖ్యమంత్రులపై క్రిమినల్ కేసులు నమోదై ఉండగా, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై అత్యధికంగా 89 కేసులు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది.



# చర్చకు నేనొస్తా

- డీఎస్సీ ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో అక్రమాలు జరిగాయి
- డీఎస్సీ అవకతవకలపై చర్చకు రావాలని లోకేష్ కు సవాల్
- చంద్రబాబు వస్తే చర్చకు జగన్ వస్తారు
- మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని

అమరావతి జూలై 28 (డ్రీమ్ టైమ్స్):
డీఎస్సీ ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయంటూ మంత్రి నారా లోకేష్ పై మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని మండిపడ్డారు. డీఎస్సీ అవకతవకలపై బహిరంగ చర్చకు రావలసిందిగా ఆయన లోకేష్ కు సవాల్ విసిరారు. ఒకవేళ చర్చకు ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తే వైసీపీ నుంచి జగన్ వస్తారని... లోకేష్ వస్తే స్వయంగా తానే ఎదుర్కొంటానని స్పష్టం చేశారు. డీఎస్సీ పేరుతో నిరుద్యోగ యువత జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని పేర్ని నాని ఆరోపించారు. ప్రభుత్వం దీనిని 'మెగా డీఎస్సీ' అని ప్రచారం చేసుకుంటున్నప్పటికీ, లోపల జరిగిన అక్రమాల వల్ల ఇది 'దగా డీఎస్సీ'గా మారిందని మండిపడ్డారు. మంత్రిగా లోకేష్ విద్యాశాఖ బాధ్యతలను పక్కనబెట్టి మిగిలిన అన్ని శాఖల

-మిగతా 3లో



## 'రేపిస్టులకు మద్దతు ఇచ్చిన వ్యక్తికి విద్యాశాఖ మంత్రి పదవా..?

- ప్రధాని మోదీ నిర్ణయాన్ని ప్రశ్నించిన రాహుల్ గాంధీ
- పార్లమెంట్ వెలుపల మీడియాతో ఘాటు విమర్శలు
- విద్యార్థుల ఆందోళనల వేళ కేంద్రంపై ప్రతిపక్ష దాడి
- 'క్యాబినెట్‌లో ఇతరులు లేరా?' అంటూ రాహుల్ ప్రశ్న
- నీట్ వివాదం తర్వాత విద్యాశాఖలో మార్పులు
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం జోషికి అదనపు బాధ్యతలు
- విద్యాశాఖ మంత్రి ఎంపికపై రాజకీయ దుమారం
- ప్రహ్లాద్ జోషిపై గత ఆరోపణలను ప్రస్తావించిన రాహుల్

న్యూఢిల్లీ
కేంద్ర నూతన విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషిని ప్రధాని మోదీ నియమించిన సంగతి తెలిసిందే. అయితే, ప్రహ్లాద్ జోషి నియామకంపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. ప్రహ్లాద్ జోషి అత్యంత మోసకారి అని, పైగా రేపిస్టులకు మద్దతు పలికారని రాహుల్ అన్నారు. అలాంటి వ్యక్తికి విద్యాశాఖ మంత్రి పదవి ఎలా ఇస్తారని ప్రధాని మోదీని రాహుల్ ప్రశ్నించారు. మంగళవారం పార్లమెంట్ వెలుపల

-మిగతా 3లో

# రైతులకు అండగా ఉండాలి


- తాగునీటి సమస్య తలెత్తకూడదు
- ప్రతి పంటకు బీమా నమోదు చేయించే బాధ్యత కలెక్టర్లదే
- నిరంతరం మానిటరింగ్ చేసేలా ఎల్ నినో కంట్రోల్ రూమ్
- ఎల్ నినోపై క్షేత్ర స్థాయి అంచనాలు... ప్రణాళికలు ఉండాలి
- ఏడాదికి సరిపడా పశుగ్రాసం అందుబాటులో ఉండేలా ప్రణాళికలు
- ఎల్ నినోపై ఆర్డీఆర్సీల స్థాయిలో ఇంప్లిమెంటేషన్ కమిటీలు
- ఆగస్టు 3 నుంచి ఎల్ నినోపై అవగాహన కార్యక్రమాలు
- రైతుల్లో కల్పించాల్సిన అవగాహనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష

**ఎల్ నినో యాక్షన్ ప్లాన్ అమల్లో నిర్లక్ష్యాన్ని సహించను**

అమరావతి జూలై 28 (డ్రీమ్ టైమ్స్):
ఎల్ నినో కష్టకాలంలో రైతులకు అదుకోవాలని... వారికి సరైన సమాచారాన్ని సహకారాన్ని అందిస్తూ అండగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఎల్ నినో ప్రభావం, ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలు, రైతుల్లో కల్పించాల్సిన అవగాహనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షించారు. ఎల్ నినో ప్రభావం ఏ మేరకు ఉంటుంది... దానికి సంబంధించిన యాక్షన్ ప్లాన్ వంటి అంశాలను సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. జూలై నెలలో 69 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. వచ్చే మూడు నెలల్లో సరాసరి 35 నుంచి 40 శాతం మేర లోటు వర్షపాతం

-మిగతా 3లో






# ప్రధాని మోడీకి మెటా క్షమాపణలు

- వీడియో తొలగింపునకు సాంకేతిక సమస్యే కారణమని వెల్లడి
- మోడీ ఫేస్‌బుక్ వీడియోను పునరుద్ధరించిన మెటా
- ఉద్దేశపూర్వకంగా తొలగించలేదని స్పష్టం

న్యూఢిల్లీ
ప్రధాని నరేంద్రమోడీ ఫేస్‌బుక్‌లో పోస్టు చేసిన వీడియోను తొలగించిన వివాదంపై మెటా సంస్థ కేంద్ర ప్రభుత్వానికి క్షమాపణలు చెప్పింది. మోడీ వీడియోను ఉద్దేశపూర్వకంగా తొలగించలేదని, కేవలం సాంకేతిక కారణాల వల్ల అలా జరిగినట్లు మెటా స్పష్టత ఇచ్చింది. అంతేకాకుండా ఆ వీడియోను అందరికీ కనిపించేలా పునరుద్ధరించింది. ఇంతకీ ఏం జరిగింది? నీట్-యుజి 2026 పరీక్షల అక్రమాలపై కాంగ్రెస్ జనతా పార్టీ

-మిగతా 3లో



## ఎన్నికల వేళ పీవోకేలో నెత్తుటేరులు


- మూడు దశల్లో అసెంబ్లీకి పోలింగ్
- మరోవైపు ఎన్నికల్ని బహిష్కరిస్తూ నిరసనలు
- ఆందోళనకారులపై సైన్యం కాల్పులు
- గత 24 గంటల్లో 20 మంది మృతి
- 50 మందికిపైగా గాయాలు
- రావల్కోట్ రహదారులపై మృతదేహాలు

3

## జపాన్‌లో భారీ భూకంపం

- రిక్టర్ స్కేలుపై 7.1 తీవ్రత నమోదు
- సునామీ హెచ్చరికలు జారీ
- చైనాలో 18 నిమిషాల వ్యవధిలో రెండు భూకంపాలు
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ప్రకంపనల దృశ్యాలు

3




# 'వీబీ జీ రామ్ జీ'తో ఎల్ నినోకు చెక్

## కరోనా కంటే ప్రమాదకరంగా ఎల్ నినో వర్షాభావ పరిస్థితులు

- రాబోయే 4 నెలలు చాలా కీలకం
- చిరుధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలి
- నీరులేని చెరువుల్లో పశుగ్రాసం పెంచుదాం
- పొలంకుంటల నిర్మాణానికి 50 శాతం రాయితీ
- వివిధ శాఖల సమీక్షా సమావేశంలో మంత్రి సవిత



పెనుకొండ: జూలై 28 (డ్రీమ్ టైమ్స్):
కరోనా కంటే ప్రమాదకరమైన ఎల్ నినో వర్షాభావ పరిస్థితులను వీబీ జీ రామ్ జీ పథకంతో ధీటుగా ఎదుర్కొందామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత దిశా నిర్దేశం చేశారు. రాబోయే వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని నీటి ఆధారమైన పంటలకు బదులు చిరుధాన్యాల సాగును రైతులు చేపట్టాలని సూచించారు. జల జీవన్ మిషన్ కింద రూ.11.50 కోట్లు మంజూరయ్యాయని, ఆ నిధులతో తాగునీటి కల్పనకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎల్ నినోను అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సమన్వయంతో ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో ఎల్ నినోపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పెనుకొండ ఆర్డీవో కార్యాలయంలో ఎల్ నినో – వర్షాభావ పరిస్థితులు ఎదుర్కోవడంపై వ్యవసాయ, రెవెన్యూ, హార్టికల్చర్,

-మిగతా 3లో



# నిరసనకారులపై చర్యలు వద్దు

- మైనర్లను వెంటనే విడుదల చేయాలని ఆదేశం
- విద్యార్థుల హక్కులను గుర్తుచేసిన ధర్మాసనం
- రాజ్యాంగం కల్పించిన శాంతియుత నిరసన హక్కు
- మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో సిట్‌కు సూచన
- సీసీటీవీ, డ్రోన్ రికార్డులు భద్రపరచాలని ఆదేశం
- నిరసనకారుల వ్యక్తిగత వివరాలు వెల్లడించొద్దు
- ఆగస్టు 3న తదుపరి విచారణ
- రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ జూలై 28 (డ్రీమ్ టైమ్స్):
పరీక్ష పేపర్ లీకేజీలపై దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో అరెస్టయిన విద్యార్థుల విషయంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతృత్వంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ సహా పలు రాష్ట్రాల్లో జరిగిన ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లకు సంబంధించి, వారిపై ఎలాంటి బలవంతపు, కఠిన చర్యలు తీసుకోవద్దని అత్యున్నత న్యాయస్థానం తన తాత్కాలిక ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. 18 ఏండ్లలోపు వారిని, అలాగే ఎలాంటి నేరచరిత్ర లేని విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది.

-మిగతా 3లో



# డీఎస్సీ అక్రమాలపై జెన్ జీ మరోసారి ఆగ్రహం

- వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు
- విద్యాశాఖ మంత్రి లోకేష్ రాజీనామా చేయాలి
- ఎక్స్ వేదికగా మాజీ సీఎం జగన్ డిమాండ్

ఏపీ బ్యూరో జూలై 28 (డ్రీమ్ టైమ్స్):
డీఎస్సీ పేపర్ లీకేజీ, స్పోర్ట్స్ కోటా పేరిట అన్యాయాలు... ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం తమకు చేసిన అన్యాయంపై ఇవాళ జెన్ జీ ఆగ్రహావేశాలను రాష్ట్రం మొత్తం మళ్లీ చూసింది. ప్రజలతో కలిసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన ర్యాలీలు అన్నీ విజయవంతమయ్యాయి. డీఎస్సీ అక్రమాలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని, పేపర్ లీకేజీ నుంచి స్పోర్ట్స్ కోటా పోస్టుల భర్తీ వరకు జరిగిన ప్రతి అక్రమంపైనా సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని గట్టిగా గొంతెత్తారు. ప్రతిభతో ఉద్యోగాలు సాధించాల్సిన యువతను రోడ్లెక్కించిన పాపం సీఎం చంద్రబాబు ప్రభుత్వానిదే.

-మిగతా 3లో

డ్రీమ్ టైమ్స్
తెలుగు దిన పత్రిక
DREAM TIMES DAILY NEWS PAPER

బుధవారం
29-07-2026



# ఝార్ఖండ్‌లో 16 మంది మావోయిస్టుల లొంగబాటు



**న్యూఢిల్లీ జూలై 28 (డ్రీమ్ టైమ్స్):**
ఝార్ఖండ్‌లో మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగలింది. ఐదుగురు మహిళలతో సహా 16 మంది మావోయి స్టులు మంగళవారం ఝార్ఖండ్ రాజధాని రాంచీలో పోలీసుల ఎదుట లొంగిపో యారు. పలు ఆయుధాలను అప్పగించారు. అందులో రెండు ఏకే-47 రైఫిల్స్ ఉన్నాయి. లొంగిపోయిన వారిలో ఆరుగురిపై మొత్తం రూ. 39 లక్షల రివార్డు ఉందని సీనియర్ అధికారి తెలిపారు. లొంగిపోయిన వారిలో సంతోష్ మహతో అలియాస్ వాసుదేవ్ కూడా ఉన్నారని, ఇతనిపై 128 కేసులు నమోదై ఉన్నాయని మరియు రూ. 15 లక్షల రివార్డు ఉందని ఆయన పేర్కొన్నారు.వీరిలో ఐదుగురు మహిళా సభ్యులు కూడా ఉన్నారు. నిషేధిత సీపీఐ (మావోయిస్ట్) ప్రాంతీయ కమిటీ సభ్యుడైన సంతోష్ మహతో లొంగిపోవడం జార్ఖండ్ పోలీసులకు ఒక గొప్ప విజయమని జార్ఖండ్ డీజీపీ తదాష మిశ్రా పేర్కొన్నారు. వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 128 కేసుల్లో సంతోష్ నిందితుడిగా ఉన్నాడు. లొంగిపోయిన మవోస్టులందరికి చట్టపరంగా పునరావాసం కల్పిస్తామన్నారు. రాష్ట్రాన్ని నేరరహితంగా మార్చేందుకు జార్ఖండ్ పోలీసులు నిబద్ధతతో పని చేస్తున్నారని డీజీపీ తెలిపారు.

# విస్కాన్సిన్ రాష్ట్రాన్ని వణికించిన టోర్నడో..

– స్తంభాలు కూలిపోయి నిలిచిన విద్యుత్ సరఫరా



**న్యూఢిల్లీ జూలై 28 (డ్రీమ్ టైమ్స్):**
అమెరికాలోని విస్కాన్సిన్ రాష్ట్రాన్ని సోమవారం తీవ్రమైన టోర్నడో వణికించింది. ఈ టోర్నడో ధాటికి విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. దాంతో విస్కాన్సిన్‌తోపాటు అమెరికా మధ్య పశ్చిమ ప్రాంతంలోని పలు రాష్ట్రాల్లో 3.9 లక్షల ఇళ్లకుపైగా విద్యుత్తు సరఫరా కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. మెనాషా , యాపిల్‌టన్ నగరాలపై ఇది తీవ్ర ప్రభావాన్ని చూపిందని తెలిపారు.టోర్నడో ధాటికి ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. భారీ వృక్షాలు నేలకూలాయి. మరోవైపు విద్యుత్తు స్తంభాలు పడిపోయి సరఫరా నిలిచిపోవడంతో లక్షలాది మంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాదాపు 20 నిమిషాలపాటు టోర్నడో విధ్వంసం సృష్టించిందని అధికారులు తెలిపారు. ఇదే సమయంలో విస్కాన్సిన్‌లోని వైట్‌వాటర్ ప్రాంతంలో చెట్ల కొమ్మలను తొలగిస్తున్న విద్యుత్తు శాఖ ఉద్యోగి పిడుగుపడి మృతిచెందాడు. అమెరికా వాతావరణ శాఖ ఈ టోర్నడోను అత్యంత ప్రమాదకరమైనదిగా ప్రకటించింది. సహాయక బృందాలు నష్టాన్ని అంచనా వేయడంతోపాటు శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం సహాయక చర్యలు చేపట్టాయి. మరోవైపు గ్రేట్ లేక్స్, ఒహాయో వ్యాలీ ప్రాంతాల్లో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

# యానాదులకు అండగా నిలిచిన ఆనాల సునీల్



విలేకరులతో మాట్లాడుతున్న ఆనాల సునీల్

**చిట్వేలి (డ్రీమ్ టైమ్స్) జులై 28:**
తిరుపతి జిల్లా చిట్వేలి మండలం ఎల్లమ్మ రాజు చెరువులో నెలకొన్న చేపల వివాదంలో జనసేన నాయకులు ఆనాడు సునీల్ ఎస్టి యానాదుల వైపు అండగా నిలిచారు. గత మూడు రోజులుగా జరుగుతున్న ఈ వాదంలో అనర్హులు చెరువులో చేపలు పట్టడం వల్ల ఏర్పడిన వివాదం ముదిరిపాకానపడింది. ఈ సందర్భంగా చెరువు లీజు అర్హత కలిగిన జల పుత్రులు ఇందుకు వచ్చి అధికారులను ఆశ్రయించారు. దీంతో రెవెన్యూ పోలీసు ఇరిగేషన్ ఫిషరీస్ శాఖల అధికారులు రంగంలోకి దిగారు. చెరువు లీజు గడువు ముగియడంతో జలపుత్రులకు ఆ చెరువులో చేపలు పట్టే సమయం ముగిసినందున ఆ స్థానంలో చెరువుకు చుట్టుపక్కల గల గ్రామాలలోని యానాదులు చేపలు పట్టి జీవనం సాగించడానికి కానాల సునీల్ అధికారులతో గట్టి ప్రయత్నం చేశారు. దీనిపై సోమవారం రాత్రి యానాదులను చెరువులో దింపి చేపల వేటను ప్రారంభించారు. ఈ వివాదం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా సునీల్ ఎల్లంరాజు చెరువు వద్ద విలేకరులతో మాట్లాడుతూ తాను ఎస్టీలు చేపల వేటతో జీవనం భృతి పొందడానికి చేస్తున్న ప్రయత్నంలో వారికి అండదండగా ఉంటానన్నారు. ఎల్లమ్మ రాజు చెరువులో నెలకొన్న చేపల వేట సమస్యను వైసీపీ ఆసరాగా తీసుకుని కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటు అన్నారు. జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో జల పుత్రులకు ఎలాంటి సేవలు అందుతున్నాయో ముందుగా గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన టిడిపి నాయకులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ఎస్టీ యానాదులు పాల్గొన్నారు.

# ఫ్రాన్స్, స్పెయిన్ సరిహద్దుల్లో కార్చిచ్చు విధ్వంసం..

**నవంబర్ మొదటి వారంలోపు ఆర్పడం సాధ్యం కాదట..!**



**న్యూఢిల్లీ జూలై 28 (డ్రీమ్ టైమ్స్):**
ఫ్రాన్స్, స్పెయిన్ సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో కార్చిచ్చు విధ్వంసం సృష్టిస్తోంది. ఇప్పటివరకు ఫ్రాన్స్‌లో 420 చదరపు కిలోమీటర్లకుపైగా.. స్పెయిన్‌లో 1,25,000 ఎకరాలకుపైగా అటవీ ప్రాంతం అగ్నికి ఆహుతైంది. గిరాండ్ ప్రాంతంలో కోట్ల విలువచేసే 240కి పైగా విలాసవంతమైన ఇళ్లు కాలి బూడిదయ్యాయి. ఫ్రాన్స్‌లో ఈ భారీ కార్చిచ్చు నవంబర్ మొదటి వారం వరకు కొనసాగవచ్చని యూరోపియన్ యూనియన్ అధికారులు హెచ్చరించారు.ఐరోపాలో అగ్నికీలలవల్ల ఈ ఏడాది అత్యంత ఘోరమైన సంవత్సరాలలో ఒకటిగా నిలిచిపోతుందన్నారు. ఈ వారం ఉష్ణోగ్రతలు మళ్లీ పెరుగుతుండటంతో ఫ్రాన్స్, స్పెయిన్, గ్రీస్‌లలో కార్చిచ్చుల ప్రమాదం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. శుక్రవారం సాయంత్రం ఫ్రాన్స్, స్పెయిన్ సరిహద్దుల్లో ప్రారంభమైన ఈ అగ్నికీలలు పలు నగరాలకు వేగంగా వ్యాపిస్తున్నాయి. దాంతో ఫ్రాన్స్‌పై భారీ పొగ మేఘాలు కమ్ముకున్నాయి. దాంతో వీటిని ఆర్పడం సవాలుగా మారింది. కార్చిచ్చును ఎదుర్కోవడానికి యూరోపియన్ కమిషన్ సమన్వయంతో ఫ్రాన్స్‌కు ఏడు అగ్నిమాపక విమానాలు, నాలుగు హెలికాప్టర్లు, స్పెయిన్‌కు ఆరు విమానాలు, మూడు అగ్నిమాపక బృందాలను పంపారు. భారీ గాలులు, ఉరుములు, మెరుపులతో ఇవి అగ్ని సుడిగుండాలుగా మారే ప్రమాదముందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. మంటలు వేగంగా వ్యాపిస్తుండడంతో ఫ్రాన్స్‌లో సుమారు రెండు లక్షల మంది, స్పెయిన్‌లో లక్ష మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అడవుల్లోని జంతువులు మంటల వేడిని తాళలేక రోడ్లపైకి పరుగులు తీస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పెంపుడు జంతువులను కూడా ప్రజలు బయటకు వదిలేస్తున్నారు. రాబోయే రెండు వారాల్లో పరిస్థితులు మరింత కఠినంగా ఉంటాయని, వీటిని కలిసికట్టుగా ఎదుర్కోవాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ప్రజలకు పిలుపునిచ్చారు. అగ్నికీలలు ఆర్పడానికి వేలమంది సిబ్బంది పని చేస్తున్నారని.. వందల సంఖ్యలో హెలికాప్టర్‌లతో నీళ్లు వెదజల్లుతున్నారని తెలిపారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రజలు గాలి కాలుష్యం సమస్యను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

# ప్రధానమంత్రిని కాపాడటం కోసం ప్రధాన్‌ను తొలగించారు

**మోదీపై లోక్‌సభలో అఖిలేష్ యాదవ్ విమర్శలు**



**న్యూఢిల్లీ జూలై 28 (డ్రీమ్ టైమ్స్):**
నీట్ పేపర్ లీకేజీ అంశంలో ప్రధాన మంత్రి మోదీని కాపాడటానికి మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించారు అని ఎస్పీ ఎంపీ అఖిలేష్ యాదవ్ అన్నారు. నీట్ పేపర్ లీకేజీ అంశంపై, కొత్తగా ప్రవేశపెడుతున్న యాంటీ పేపర్ లీక్ అమెండ్‌మెంట్ బిల్లుపై మంగళవారం పార్లమెంట్‌లో చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా లోక్‌సభలో సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత, ఎంపీ అఖిలేష్ యాదవ్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు.ఈ అంశంలో ప్రధాన మంత్రిని రక్షించేందుకు ప్రధాన్‌ను తొలగించారు అని అఖిలేష్ అన్నారు. "చట్టం అంత బలంగా ఉంటే బీజేపీ పదేళ్ల పాలనలో 20 పేపర్ లీకేజీలు ఎలా జరిగాయి..? ఈ విషయంలో దోషులను రక్షించేవారిని ఎలా నమ్ముతాం. ఇప్పుడు తీసుకొస్తున్న కొత్త బిల్లు.. పాత బిల్లుకు చిన్న సవరణ మాత్రమే. అలాంటి ఈ బిల్లుతో ఎవరిని మోసం చేయాలి అనుకుంటున్నారు. నేను ఎమర్జెన్సీని చూడలేదు. కానీ, దేశ రాజధానిలో ఇప్పుడేం జరిగిందో మాత్రం చూశా. ప్రభుత్వం టియర్ గ్యాస్ షెల్స్ వంటి ఆయుధాల్ని విద్యార్థుల్ని అణచివేయడానికి వాడింది. మంత్రి పదవికి రాజీనామా చేసిన దర్మేంద్ర ప్రధాన్ పార్లమెంట్‌కు వస్తుంటే ఆయనకు పూలదండలతో స్వాగతం పలుకుతున్నారు" అంటూ అఖిలేష్ యాదవ్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వం కొన్నింటికి తలొగ్గుతుందని, కానీ, ఈ విషయంలో ప్రభుత్వం తలవంచడానికి ఎవరో ఒకరు అవసరం అంటూ అఖిలేష్ అన్నారు. పార్లమెంట్‌లో నీట్ పేపర్ లీకేజీతోపాటు, కొత్త బిల్లుపై 10 గంటలపాటు చర్చ జరగనుంది. మంగళవారం రాత్రి 10.00 గంటల వరకు కూడా చర్చ జరిగే అవకాశం ఉంది. ఇక, ఈ బిల్లు బుధవారం లోక్‌సభలో ఆమోదం పొందే అవకాశం ఉంది. ఎస్పీ, కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాయి. ఈ కొత్త బిల్లు పేపర్ లీకేజీలను అరికట్టేంత బలంగా లేదని అభిప్రాయపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాల వాదనను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందా లేదా అనేది చూడాలి.

# ఎయిరిండియా విమాన ప్రమాదంపై అక్టోబర్‌లో తుది నివేదిక..

**సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం**



**న్యూఢిల్లీ జూలై 28 (డ్రీమ్ టైమ్స్):**
గత ఏడాది జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదంపై తుది నివేదికను వచ్చే అక్టోబర్‌లో సమర్పిస్తామని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈ ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) విచారణ జరుపుతోంది. ప్రమాదం జరిగి ఏడాది గడిచినా ఇంకా ప్రభుత్వానికి నివేదిక అందలేదు. దీనిపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా, జస్టిస్ వి.మోహన ఆధ్వర్యంలోని బెంచ్ మంగళవారం విచారణ జరిపింది.ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు సమాధానం ఇచ్చారు. ఈ ప్రమాదంపై ఏఏఐబీ ఆధ్వర్యంలో విచారణ జరుగుతోందని, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్ అవసరమైన సమాచారాన్ని కూడా అందిస్తారని కోర్టుకు తెలిపారు. ఈ సూచనల్ని ఏఏఐబీ సమీక్షిస్తుందని, విచారణ సమయంలో అవసరమైతే వాటిని పరిశీలిస్తుందన్నారు. ప్రమాదానికి సంబంధించి నాలుగు సిమ్యులేషన్ టెస్టులు పూర్తయ్యాయని తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. ఇంతకుముందు ఇదే అంశంపై ఏఏఐబీ కూడా కోర్టుకు కొన్ని కీలక వివరాలు సమర్పించింది. కాక్‌పిట్ వాయిస్ రికార్డింగ్స్, విమానం ఎగిరేటప్పుడు పైలట్లకు సంబంధించిన ఫొటోల్ని బహిరంగంగా వెల్లడించడం కుదరదని కోర్టుకు తెలిపింది. తాజా పరిస్థితికి సంబంధించి అక్టోబర్ మొదటి వారంలో విమాన ప్రమాదంపై తుది నివేదికను కోర్టుకు సమర్పిస్తామని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో కేసు విచారణను సుప్రీంకోర్టు అక్టోబర్ 13కు వాయిదా వేసింది. గత ఏడాది జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియాకు చెందిన బోయింగ్ 787-8 అనే ఏఐ171 విమానం ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. ఈ విమానం కూలిన ఘటనలో 250 మందికిపైగా మరణించారు.

# విజయంతో పాటు వినయం కూడా ముఖ్యం



**న్యూఢిల్లీ జూలై 28 (డ్రీమ్ టైమ్స్):**
కలిసికట్టుగా పోరాడితే విజయం వరిస్తుందని కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమం వల్ల స్పష్టమైంది. కానీ విజయం ఎంత ముఖ్యమో వినయం కూడా అంతే ముఖ్యమని సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్ చుక్ అన్నారు. కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో సీజేపీ చేసుకున్న సంబురాల వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. దీనిపై జరుగుతున్న చర్చల నేపథ్యంలో ఆయన ఈ విధంగా స్పందించారు. గౌరవంతో, సంయమనంతో, బాధ్యతాయుతంగా సంబురాలు జరుపుకోవాలని సామాజిక కార్యకర్తలు, తన మద్దతుదారులను కోరారు.ఆ వీడియోలు యువతరం స్ఫూర్తికి ప్రతిబింబంసంబురాల వీడియోలపై వ్యతిరేకత వెల్లువెత్తుతున్న నేపథ్యంలో సీజేపీ స్పోక్స్‌పర్సన్ సౌరవ్ దాస్ 'శ'లో స్పందించారు. ఎంత సమయమైనా రోడ్డుపై బైఠాయించగలం. కోల్డ్ కాఫీ తాగుతూ సంఘటితమవ్వగలం. డాన్స్ చేస్తూ నిరసన తెలపగలం. ఇదే ఈతరం స్వభావం అని అన్నారు. సృజనాత్మకత, దృఢత్వం ఉన్న జెన్ జడ్ తరాన్ని ఒకే మూసలో ఇరికించడం సాధ్యం కాదు. విజయం తరువాత చేసుకున్న సంబురాల వీడియోలు యువతరం స్ఫూర్తిని ప్రతిబింబిస్తున్నాయని, జెన్ జడ్ ఆత్మవిశ్వాసాన్ని ప్రేరేపిస్తున్నాయని అన్నారు. అయితే కొంతమందికి నేటి యువతరం భాష అర్థం కావడం లేదని ఆయన ఆరోపించారు. ఎవరేమనుకున్నా నేటి జెన్ జడ్ యువత ఇలాగే ఉంటుందని అన్నారు.

## ప్రధాని మోడీకి మెటా క్షమాపణలు

మొదటి తరువాయి

(సిజెపి) నేతృత్వంలో విద్యార్థులు సుదీర్ఘ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆ నేపథ్యంలోనే జులై 23న ప్రధాని మోడీ మొదటిసారిగా నేరుగా (జెన్-జీ) యువతను ఉద్దేశించి ఫేస్‌బుక్ వేదికగా ప్రసంగించారు. ఆ ఫేస్‌బుక్ వీడియోలో పరీక్ష పేపర్ లీకేజీలకు పాల్పడే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఇందుకోసం మరింత కఠినమైన చట్టపరమైన నిబంధనలను కేంద్ర మంత్రివర్గం ముందుకు తీసుకువస్తామని చెప్పారు.

"ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నేను సంబంధిత శాఖలను ఆదేశించాను. పేపర్ లీక్ కేసులను విచారణ చేయడానికి కఠినమైన శిక్షలు, ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసేలా రూపొందించిన ముసాయిదా చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు క్యాబినెట్‌లో చర్చిస్తాం. మన యువత సంక్షేమం, భవిష్యత్తు కంటే మరేదీ ముఖ్యం కాదు" అని మోడీ ఆ వీడియోలో చెప్పారు. దాదాపు 22 లక్షల మంది విద్యార్థుల విద్యా సంవత్సరం వృథా కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు.

అయితే ఫేస్‌బుక్ జులై 28 తెల్లవారుజామున ఈ వీడియో యాక్సెస్‌ను కొద్దిసేపు నిలిపివేసింది. దీనితో మోడీ పెట్టిన వీడియో పోస్టు కనిపించకుండా పోయింది. కేంద్ర ప్రభుత్వం ఈ చర్యను తీవ్రంగా పరిగణించింది. ప్రధాని మోడీ పోస్టు ఎందుకు తొలగించారో చెప్పాలంటూ, మెటా గ్లోబల్ పబ్లిక్ పాలసీ హెడ్ కు ఐటీ మంత్రిత్వశాఖ సమన్లు జారీ చేసింది. దీనితో దిగి వచ్చిన మెటా కేంద్ర ప్రభుత్వానికి క్షమాపణ చెప్పింది. "ప్రధాని నరేంద్ర మోడీ వీడియోను పొరపాటున తొలగించడం జరిగింది. ప్రస్తుతం దీనిని తిరిగి పునరుద్ధరించాం" అని మెటా ప్రతినిధి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇకపై భారీ శిక్షలు తప్పవు: జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేపట్టిన నిరసనలకు దిగి వచ్చిన మోడీ ప్రభుత్వం, వారి డిమాండ్లు అన్నీ నెరవేరుస్తామని హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే సోమవారం పార్లమెంట్‌లో 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిల్లు, 2026'ను ప్రవేశపెట్టింది. ఈ ప్రతిపాదిత బిల్లు ప్రకారం, నిందితులకు 10 ఏళ్ల వరకు జైలు శిక్ష, భారీ జరిమానాలు విధిస్తారు. అంతేకాదు పరీక్షల అక్రమాలకు సంబంధించిన కేసును విచారణ చేయడానికి ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తారు.

### 'రేపిస్టులకు మద్దతు ఇచ్చిన వ్యక్తికి విద్యాశాఖ మంత్రి పదవా..?

మొదటి తరువాయి

రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మోదీ తీరుపై ఘాటు విమర్శలు చేశారు. "ఒక పక్క విద్యార్థులు, యువత దేశ విద్యావ్యవస్థపై ఆందోళన చేస్తున్నారు. ఎందరో యువతులు కూడా ఈ నిరసనల్లో పాల్గొంటున్నారు. వారిపై దాడి చేశారు. పైగా.. రేపిస్టులకు మద్దతు పలికిన వారి (ప్రహ్లాద్ జోషి)ని బీజేపీ నియమించింది. ఆయన అత్యంత నీచమైన వ్యక్తి. అత్యాచారం చేసేవారికి మద్దతుగా నిలిచేవారికంటే చెడ్డవారు ఉండరు. అలాంటిది ఆ వ్యక్తే దేశ విద్యాశాఖ మంత్రి అయ్యారు. క్యాబినెట్‌లో ఎంతో మంది ఉన్నారు. వారిలో ఇంకెవరినైనా ప్రధాని మోదీ విద్యాశాఖ మంత్రిగా నియమించాల్సింది. ఇది ప్రధాని నుంచి ఊహించని స్పందన. ఇతరులెవరినైనా ఎంపిక చేయాల్సింది" అంటూ రాహుల్ విమర్శించారు. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన స్థానంలో మరో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ మంత్రిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

## నిరసనకారులపై చర్యలు వద్దు

మొదటి తరువాయి

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనతో కూడిన ధర్మాసనం మంగళవారం విద్యార్థులపై పోలీసుల తీరును తప్పుబట్టింది. రాజ్యాంగం శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పించిందని గుర్తు చేసింది. తక్షణమే మైనర్లను విడిచి పెట్టాలని అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న వారికి మాత్రమే రక్షణ కల్పించాల్సిన అవసరం లేదని పేర్కొంది. నిరసనకారుల పట్ల పోలీసులు తీసుకున్న చర్యలపై వివరణ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వంతో పాటు ఢిల్లీ పోలీసులకు సుప్రీంకోర్టు అవకాశం కల్పించింది. వాళ్లు తమ వాదనలు వినిపించవచ్చని తెలిపింది. సీసీటీవీ ఫూటేజ్, డ్రోన్ రికార్డింగ్‌లు, వైర్‌లెస్ కమ్యూనికేషన్స్, ఇతర రికార్డులకు చెందిన వీడియోలను దాచిపెట్టాలని ఆదేశాల్లో పేర్కొంది. అదే విధంగా పోలీసులు రికార్డు చేసిన నిరసనకారులకు చెందిన పర్సనల్ డేటా కానీ, వివరాలను కానీ పబ్లిష్ చేయవద్దని ఆదేశించింది. పెల్లెట్ గన్స్ వాడిన అంశంపైనా ధర్మాసనం వాదనలు విన్నది. నేర చరిత్ర లేని విద్యార్థులను తక్షణమే రిలీజ్ చేయాలని పేర్కొంది. ఆగస్టు 3న తదుపరి విచారణను చేపట్టనుంది.

స్వతంత్ర విచారణ జరగాల్సిందే

'నిర్దోషులపై అతిక్రమణలు, దౌర్జన్యాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్టం ఊరుకోదు. తన పని తాను చేసుకుపోతుంది' అని ధర్మాసనం హెచ్చరించింది. ఈ ఘటనలపై 'స్వతంత్ర విచారణ'జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయ పడింది. విద్యార్థులకు, పోలీసులకు జరిగిన గాయాల పట్ల నిష్పాక్షిక దర్యాప్తు చేపట్టాలని పేర్కొంది. దీని కోసం మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేయాలని సుప్రీం తన ఆదేశాల్లో స్పష్టం చేసింది. కాగా 'బాధ్యులను తేల్చనప్పుడు, విచారణకు అర్థమే లేదు' అని సీజేఐ పేర్కొన్నారు.

## చర్చకు నేనొస్తా

మొదటి తరువాయి

వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని విమర్శించారు. కొంచెమైనా నైతికత ఉంటే ఈ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు, డీఎస్సీ అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ జరిపించి మంత్రి పదవికి లోకేష్ రాజీనామా చేసేంత వరకు తమ పోరాటం ఆగేది లేదని హెచ్చరించారు. చంద్రబాబు ప్రభుత్వం కేవలం తమ సొంత ప్రచార సాధనాలు, పత్రికల ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో ఎమ్మెల్యే బోండా ఉమ మంత్రి పదవి కోసం తీవ్రంగా లాబీయింగ్ చేస్తున్నారంటూ చేశారు.

## రైతులకు అండగా ఉండాలి

మొదటి తరువాయి

నమోదయ్యే అవకాశం ఉందన్న అధికారులు... జూన్ -- నవంబర్ మధ్య 844 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 551 మి.మీ మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు. అంచనాలకు మించి ఎల్ నినో ప్రభావం ఉండబోతోందని అధికారులు తెలిపారు. ప్రసుతానికి ఉన్న అంచనాల ప్రకారం అన్ని జిల్లాల్లోనూ ఎల్ నినో ప్రభావం చూపిస్తోందని, ఎక్కువగా పశ్చిమ గోదావరి, ప్రకాశం, అన్నమయ్య, కృష్ణా, కడప జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొంటాయని అధికారులు చెప్పారు. 2.78 లక్షల హెక్టార్లలో ప్రత్తి, 1.07 లక్షల హెక్టార్లలో వరిపై ప్రభావం చూపిస్తుందని అధికారులు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పరిధిలోనే వరి పంటకు ఎక్కువ నష్టం వాటిల్లే అవకాశం ఉందని ముఖ్యమంత్రికి వివరించారు.

వంశధార నుంచి జలాలు అందుబాటులోకి వస్తే వాటిని సద్వినియోగం చేసుకుంటూ పంటలను కాపాడాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో 122 హై రిస్క్ మండలాలను గుర్తించామని అధికారులు సీఎంతో వివరించడంతో... హై రిస్క్ మండలాల్లో బోర్ ఆధారంగా పంటలను కాపాడుకునే అంశాన్ని పరిశీలించాలని ఆదేశించారు. ఆగష్టు 3 నుంచి అవగాహన కార్యక్రమాలు, ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి, అత్యవసర విత్తన ప్రణాళికలను రూపందించినట్లు అధికారులు తెలిపారు. కంది, ఆముదం, మినుము పంటలను ఇప్పటికి కొందరు ప్రత్యామ్నాయ పంటలుగా వేస్తున్నారని చెప్పారు. ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద ఈ నెల 31వ తేదీ వరకు నమోదు ప్రక్రియ కొనసాగిస్తున్నామని... అయితే వరి పంటకు ఆగస్ట్ 15 వరకు సమయం ఉందని అధికారులు వివరించారు. ఇప్పటి వరకు 6.30 లక్షల హెక్టార్ల మేర పంటలను బీమాలో నమోదు చేశామని అధికారులు తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ... వేసిన ప్రతి పంటకు బీమా నమోదు చేయాల్సిందేనని... ఏ పంటకైనా బీమా నమోదు చేయకపోతే... దానికి కలెక్టర్లే బాధ్యత వహించాలని ముఖ్యమంత్రి హెచ్చరించారు. అలాగే తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. పశుగ్రాసానికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టినట్లు అధికారులు వివరించారు. 5 నెలలకు సరిపడా 286.30 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసం అందుబాటులో ఉంచామని అధికారులు చెప్పారు. అయితే 5 నెలలకు సరిపడా పశుగ్రాసం సిద్ధం చేసుకుంటే సరిపోదని... ఎల్ నినో ప్రభావం ఏడాది పొడవునా స్పష్టంగా సూచనలు ఉండడంతో ఏడాదికి అవసరమైన పశు గ్రాసాన్ని అందుబాటులో ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

# దేశంలో అత్యంత ధనిక సీఎం డీకే శివకుమార్

- బిలియనీర్ సీఎంల జాబితాలో నలుగురు
- చంద్రబాబు ఆస్తులు రూ.931 కోట్లు.. విజయ్‌కు రూ.648 కోట్లు
- 31 మంది సీఎంల ఆస్తుల విలువ రూ.3,660 కోట్లు
- 14 మంది ముఖ్యమంత్రులపై క్రిమినల్ కేసులు
- రేవంత్‌రెడ్డిపై అత్యధికంగా 89 కేసులు
- శివకుమార్, చంద్రబాబుపై చెరో 19 క్రిమినల్ కేసులు
- ఒమర్ అబ్దుల్లా, సువేందు అధికారికి తక్కువ ఆస్తులు
- ఎన్నికల అఫిడవిట్ల ఆధారంగా ఏడీఆర్ నివేదిక



న్యూఢిల్లీ

దేశంలో అత్యంత సంపన్న ముఖ్యమంత్రిగా.. కర్నాటక సీఎం డీకే శివకుమార్ నిలిచారు. ఆయన ఆస్తుల విలువ సుమారు 1413 కోట్లుగా ఉంది. దేశంలో ఉన్న 31 మంది ముఖ్యమంత్రుల్లో నలుగురు మాత్రమే బిలియనీర్లుగా ఉన్నారు. అయితే ముఖ్యమంత్రులు సగటు ఆస్తుల విలువ 118.07 కోట్లుగా ఉన్నట్లు అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ నివేదిక(-ాంంశీషిఙ్ఛశీఅ టశీతీ ఐవవశీషిఙ్ఛఅష =వటశీతీఎం =వజూశీతీ) ద్వారా వెల్లడైంది. కానీ అత్యంత సంపన్న సీఎం లిస్టులో డీకే శివకుమార్ టాప్‌లో ఉన్నారు. ఇక మిగితా ముగ్గురిలో ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, టీవీకే చీఫ్ జోసెఫ్ విజయ్, అరుణాచల్ ప్రదేశ్ బీజేపీ సీఎం ప్రేమా ఖందు ఉన్నారు. చంద్రబాబు ఆస్తుల విలువ 931 కోట్లు కాగా, సీఎం విజయ్ వద్ద 648 కోట్లు, ప్రేమా ఖందు వద్ద 332 కోట్ల ఆస్తులు ఉన్నట్లు నివేదికలో తెలిపారు.

ముఖ్యమంత్రులకు చెందిన ఫైనాన్షియల్, క్రిమినల్, ఎడ్యుకేషన్ బ్యాక్‌గ్రౌండ్ విశ్లేషణ ఆధారంగా సంపదను గుర్తించినట్లు ఏడీఆర్ తన రిపోర్టులో పేర్కొన్నది. హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖూ ఆస్తుల విలువ 7.81 కోట్లు. ఆయన పీజీ చదివారు. పెన్షనర్, ప్రైవేటు కాంట్రాక్టర్, సెల్ఫ్ ఎంప్లాయిడ్ ట్రావెల్ గైడ్‌గా తన ప్రొఫెషన్‌ను ఆయన రాసుకున్నారు. పంజాబ్ సీఎం భగవంత్ మాన్ ఆస్తుల విలువ 1.97 కోట్లు, ఆయన 12వ తరగాతి పాసయ్యాడు. ఢిల్లీ సీఎం రేఖా గుప్తా ఆస్తులు విలువ 5.31 కోట్లు. డిగ్రీ చదివారు, ప్రొఫెషనల్ అడ్వకేట్ కూడా. హర్యానా సీఎం నయాబ్ సైనీ ఆస్తుల విలువ 5.80 కోట్లు, ఆయన డిగ్రీ చదివారు. స్టోన్ క్రషర్ ఓనర్ కూడా. ఎన్నికల వేళ సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా డేటాను సేకరించారు. 31 మంది ముఖ్యమంత్రుల్లో.. 14 మంది సీఎంలపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఆస్తులు తక్కువ ఉన్నవారిలో ఎన్సీపీ నేత ఒమర్ అబ్దుల్లా(రూ.55 లక్షలు), బెంగాల్ సీఎం సువేందు అధికారి(85 లక్షలు), రాజస్థాన్ సీఎం భజన్ లాల్ శర్మ (కోటి) ఉన్నారు. సీఎం ఒమర్ అబ్దుల్లా స్థిరాస్తులు వెల్లడించలేదు. క్రిమినల్ కేసులు అధిక సంఖ్యలో ఉన్న ముఖ్యమంత్రుల్లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అగ్రస్థానంలో ఉన్నారు. సీఎం రేవంత్‌పై 89 క్రిమినల్ కేసులు ఉన్నాయి. మొత్తం 14 మంది సీఎంలపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఏడీఆర్‌లో పేర్కొన్నారు. సువేందు అధికారిపై 29 కేసులు, శివకుమార్‌పై 19 కేసులు, చంద్రబాబు నాయుడిపై 19 కేసులు, సతీశన్‌పై 18 కేసులు, హేమంత్ సోరెన్‌పై 5 కేసులు, ఫడ్నవీస్‌పై 4 కేసులు, సుఖ్విందర్ సింగ్ సుఖూపై 4 కేసులు, జోసెఫ్ విజయ్‌పై రెండు కేసులు, సమ్రాట్ చౌదరీపై రెండు కేసులు, సిక్కిం పీఎస్ తమాంగ్‌పై ఓ కేసు, భగవంత్‌మాన్‌పై ఒకటి, మోహన్ చరన్ మాజీపై ఒకటి, భజన్ లాల్ శర్మపై ఓ కేసు ఉన్నాయి. ఆర్థిక పరంగా 31 మంది సీఎంలలో 15 సీఎంల ఆస్తుల విలువ 11 కోట్ల నుంచి 49 కోట్లుగా ఉంది. కానీ ఇద్దరు సీఎంల ఆస్తులు మాత్రం కోటి కన్నా తక్కువగా ఉన్నాయి. మొత్తం 31 మంది సీఎంల ఆస్తుల విలువ 3660 కోట్లుగా ఉన్నట్లు ఏడీఆర్ రిపోర్టు పేర్కొన్నది.

# ఎన్నికల వేళ పీవోకేలో నెత్తుటేరులు

-మూడు దశల్లో అసెంబ్లీకి పోలింగ్
-మరోవైపు ఎన్నికల్ని బహిష్కరిస్తూ నిరసనలు
-ఆందోళనకారులపై సైన్యం కాల్పులు
-గత 24 గంటల్లో 20 మంది మృతి
-50 మందికిపైగా గాయాలు
-రావల్కోట్ రహదారులపై మృతదేహాలు



ఇస్లామాబాద్:

పీవోకే అసెంబ్లీ ఎన్నికలు హింసాత్మకంగా మారాయి. గత 24 గంటల్లో కనీసం 20 మంది మరణించారు. 50 మందికిపైగా గాయపడ్డారు. రావల్కోట్ డ్రైక్ ఎయిత్ ప్రాంతంలో నిరసనకారులను లక్ష్యంగా చేసుకుని పాక్ సైన్యం కాల్పులకు తెగబడింది. ఉద్యమానికి సారథ్యం వహిస్తున్న జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) ప్రతినిధి ఉమర్ నజీర్ కాశ్మీరీ సోదరుడు ఉస్మాన్ నజీర్ కూడా మృతుల్లో ఉన్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. జూన్ 5 నుంచి పీవోకేలో ఎన్నికలకు, రిజర్వేషన్లకు వ్యతిరేకంగా నిరసన ప్రారంభమైంది. ఇప్పటి వరకు పాకిస్థాన్ బలగాల కాల్పుల్లో 80 మందికిపైగా మరణించినట్లు సమాచారం. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోల్లో రోడ్లపై మృతదేహాలు కనిపిస్తున్నాయి. రావల్కోట్ మృతదేహాలు, క్షతగాత్రులతో నిండిపోయింది. అంతర్జాతీయ మీడియా మాకు అండగా నిలవాలి అని సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అకీల్ భాయ్ ఓ వీడియో పోస్టు చేశారు. మరోవైపు పీవోకేలో ఎన్నికలు నిర్వహించేందుకు పాక్ ప్రభుత్వం సిద్ధమైంది. ఈ క్రమంలో 14 వేలకు పైగా సాయుధ భద్రత బలగాలను అక్కడ మోహరించింది. పీవోకేలో మొబైల్, ఇంటర్నెట్ సేవల్ని నిలిపివేసింది. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్, తాగునీటి కూడా నిలిపేసినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. పీవోకేలో 53 మంది సభ్యులున్న అసెంబ్లీలో 45 స్థానాలకు మూడు దశల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. మొదటి దశ జులై 27న జరగగా, ఆగస్టు 2, 10 తేదీల్లో మిగతా దశలు జరగనున్నాయి.

# జపాన్‌లో భారీ భూకంపం


- రిక్టర్ స్కేలుపై 7.1 తీవ్రత నమోదు
- సునామీ హెచ్చరికలు జారీ
-చైనాలో 18 నిమిషాల వ్యవధిలో రెండు భూకంపాలు
-సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ప్రకంపనల దృశ్యాలు

టోక్యో

జపాన్ దక్షిణ ప్రధాన ద్వీపమైన క్యూషులోని కుమామోటో ప్రాంతంలో మంగళవారం భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 7.1 తీవ్రతతో నమోదైందని జపాన్ వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఆ సముద్ర ఉపరితలానికి 10 కిలోమీటర్ల లోతులో ఈ భూకంపం సంభవించిందని వెల్లడించారు. అయితే, ఆస్తి, ప్రాణ నష్టానికి సంబంధించి వివరాలు తెలియాల్సి ఉంది. మరోవైపు, నాగసాకి, కాగోషిమా, సాగా, ఓయితా, మియాజాకి ప్రాంతాలకు జపాన్ ప్రభుత్వం అత్యవసర భూకంప హెచ్చరికలను జారీ చేసింది. తీర ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు పేర్కొన్నారు. నష్ట తీవ్రతను అంచనా వేయాలని జపాన్ ప్రధానమంత్రి కార్యాలయం అధికారులను ఆదేశించింది. సాయం చర్యల కోసం ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది.

రైలు సేవలు నిలిపివేత

మూడు అడుగుల మేర సునామీ వచ్చే అవకాశం ఉందని, తీర ప్రాంత ప్రజలు ఎత్తైన ప్రదేశాలకు వెళ్లిపోవాలని జపాన్ ప్రధానమంత్రి సనాయే తకాయిచి ఎక్స్ పోస్టులో వెల్లడించారు. బలమైన ప్రకంపనలు సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆమె కోరారు. ప్రజల భద్రతే తమకు ముఖ్యమని స్పష్టం చేశారు. ఇక, భద్రతా కారణాల




దృష్ట్యా క్యూషులోని బుల్లెట్ రైళ్లు, స్థానిక రైళ్లను తాత్కాలికంగా నిలిపివేశారు. జపాన్ రక్షణ మంత్రిత్వ శాఖ పరిస్థితిని అంచనా వేయడానికి ఆ ప్రాంతంలోకి విమానాలను పంపినట్లు తెలిపారు.

గతంలో 9.0 తీవ్రతతో

2011లో 9.0 తీవ్రతతో భారీ భూకంపం సంభవించింది. ఆ సమయంలో వచ్చిన సునామీలో సుమారు 18,500 మంది మరణించగా, అనేక మంది గల్లంతయ్యారు. అలాగే, 2016లో కుమామోటోను తాకిన ఒక ఘోరమైన భూకంపం వల్ల 50 మందికి పైగా మరణించగా, 1,800 మంది గాయపడ్డారు. అనేక భవనాలు ధ్వంసమయ్యాయి. ఈ ఏడాది ఏప్రిల్ 20న, దేశ ఉత్తరాదిలో 7.7 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఈ ఘటనలో కనీసం 10 మంది గాయపడటంతో పాటు టోక్యోలోని కొన్ని భవనాలు కంపించాయి. ఈ ఏడాది జూన్ 25న ఉత్తర జపాన్‌లో 7.2 తీవ్రతతో భూకంపం సంభవించినప్పటికీ, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

కాగా, ప్రపంచంలోనే అత్యంత భూకంపాలు సంభవించే

మొదటి తరువాయి

దేశాల్లో జపాన్ ఒకటి. సుమారు 125 మిలియన్ల ప్రజలకు నిలయమైన ఈ ద్వీపసమూహంలో, సాధారణంగా ప్రతి సంవత్సరం వందలాది భూకంపాలు సంభవిస్తాయి. ప్రపంచంలోని భూకంపాల్లో దాదాపు 18 శాతం ఇక్కడే సంభవిస్తాయి. వాటిలో అత్యధికం తేలికపాటివే, అయినప్పటికీ అవి కలిగించే నష్టం, అవి సంభవించే ప్రదేశాన్ని బట్టి, లోతును బట్టి మారుతూ ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

చైనాలో వరుస భూకంపాలు

ఇదిలా ఉండగా, చైనాలోని మారుమూల ప్రావిన్స్‌లో మంగళవారం ఉదయం కేవలం 18 నిమిషాల వ్యవధిలో రెండు భూకంపాలు సంభవించాయని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే పేర్కొంది. క్వింఘై ప్రావిన్స్‌లో ఉదయం 11:16, 11:34 గంటల సమయంలో 5.7, 5.8 తీవ్రతతో ప్రకంపనలు నమోదయ్యాయని తెలిపింది. ఇవి 10 కిలోమీటర్ల (6 మైళ్లు) లోతులో సంభవించాయని నివేదించింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదు.

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న దృశ్యాలు కాగా, చైనా వాయువ్య ప్రాంతంలోని క్వింఘై ప్రావిన్స్‌లో జనాభా చాలా తక్కువగా ఉంటుంది. ఇక్కడ తరచుగా భూకంపాలు సంభవిస్తుంటాయి. భూమి కంపిస్తుండగా, కొండల నుంచి దుమ్ము మేఘాలు పైకి లేస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ భూకంపాలు పొరుగున ఉన్న గాన్సు ప్రావిన్స్‌లోని అతిపెద్ద నగరాల్లో ఒకటైన లాంఝౌను కూడా ప్రభావితం చేశాయి. నగరంలోని నివాసాల్లో దీపాలు ఊగుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

## డీఎస్సీ అక్రమాలపై జెన్ జీ మరోసారి ఆగ్రహం

మొదటి తరువాయి

టీచర్ ఉద్యోగం కోసం రాత్రింబవళ్లు శ్రమించిన నిరుద్యోగ యువతకు న్యాయం చేయాల్సిన చంద్రబాబు ప్రభుత్వం... డీఎస్సీలో లీకులు, అక్రమాలతో వారి భవిష్యత్తును కాలరాసింది. సాక్ష్యాలు, ఆధారాలు కళ్ల ఎదుటే కనిపిస్తున్నా సీఎం చంద్రబాబు కానీ, విద్యాశాఖమంత్రి లోకేష్ కానీ ఇప్పటివరకు వాటిమీద నోరుమెదపలేదు. డైవర్షన్లతో కప్పిపెట్టాలని చూస్తున్నారు. యువత డిమాండ్లను సాధించే క్రమంలో యువత, విద్యార్థుల భాగస్వామ్యంతో మరిన్ని రూపాల్లో ఈ ఉద్యమాన్ని మరింత తీవ్రస్థాయికి తీసుకెళ్తాం. ఇవాళ జరిగిన



ర్యాలీల్లో పాల్గొన్న యువత, విద్యార్థులకు అభినందనలు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వీరికి ఎప్పుడూ అండగా నిలుస్తుందనీ మాజీ సీఎం జగన్ మంగళవారం ఎక్స్ వేదికగా ప్రకటించారు.

## 'వీబీ జీ రామ్ జీ'తో ఎల్ నినోకు చెక్

మొదటి తరువాయి

గ్రామీణాభివృద్ధి శాఖాధికారులతో మంత్రి సవిత మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎల్ నినో కారణంగా 140 దేశాల్లో కరువు ప్రబలే ప్రమాదముందని తెలిపారు. భారతదేశం విషయానికొస్తే దక్షిణభారతంలో ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉన్నట్లు అధికారులు హెచ్చరిస్తున్నారు. అందులోనూ ఉమ్మడి అనంతపురంలో కరువు మరింత తీవ్రంగా ఉండే అవకాశముందన్నారు. సాగు, తాగునీటి కష్టాల నుంచి గట్టెక్కేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఫామ్ పాండ్స్ (పొలం కుంటలు) నిర్మాణానికి హార్టికల్చర్ ద్వారా 50 శాతం రాయితీ అందిస్తున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ప్రతి వర్షపు నీటితో పాటు వృథాగా పోయే నీటిని ఈ కుంటలోకి మళ్లించడం ద్వారా భూగర్భ జలాల మట్టం పెంచడంతో పాటు సాగు నీటిని సంరక్షించుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఒక్కో ఫాం పాండ్ నిర్మాణానికి రూ.1.80 లక్షలు వ్యయం కాగా, ప్రభుత్వం రూ.90 వేలు రాయితీ అందిస్తుందని మంత్రి సవిత తెలిపారు.

వీబీ జీ రామ్ జీతో కరువుకు చెక్.....

జాతీయ ఉపాధి హామీ పథకం స్థానంలో ఏర్పాటు చేసిన వీబీ జీ రామ్ జీ పథకంతో ఎల్ నినో కరువు పరిస్థితులు ధీటుగా ఎదుర్కొందామని మంత్రి సవిత పిలుపునిచ్చారు. వీబీ జీ రామ్ జీ పథకంలో పని దినాలు పెంచారన్నారు. దీనివల్ల వలసలకు అడ్డుకట్ట వేయొచ్చునన్నారు. అదే సమయంలో గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, సాగునీటి కాలువ నిర్మాణాలు కూడా చేపటో చ్చునన్నారు. జల జీవన్ మిషన్ కింద రూ.11.50 కోట్లు మంజూరయ్యాయని, ఆ నిధులతో తాగునీటి కల్పనకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు అందరూ ఐక్యంగా, సమన్వయం చేసుకుంటూ ఎల్ నినో వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొందామని మంత్రి సవిత పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆనందరావు, వ్యవసాయ, రెవెన్యూ, హార్టికల్చర్, గ్రామీణాభివృద్ధి శాఖాధికారులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## విద్యార్థులకు తీర్పులు కాదు.. భరోసా కావాలి



పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలు భారత విద్యా వ్యవస్థను వెంటాడుతున్న అతిపెద్ద సంక్షోభాల్లో ఒకటిగా మారాయి. ఏళ్ల తరబడి కష్టపడి చదివిన లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును క్షణాల్లో తలకిందులు చేసే ఈ దుర్వ్యవస్థకు కేవలం న్యాయపరమైన పరిష్కారాలు సరిపోవు. ప్రశ్నాపత్రం లీక్ అయిన తర్వాత ఫాస్ట్-ట్రాక్ కోర్టులు ఏర్పాటుచేసి నిందితులను వేగంగా శిక్షించడం అవసరమే అయినప్పటికీ, అది వ్యాధికి ఇచ్చే నొప్పి నివారణ మాత్ర మాత్రమే. అసలు వ్యాధి మాత్రం పరీక్షా వ్యవస్థలోని బలహీనతలు, జవాబుదారీతనం లోపించడం, లాభాపేక్షతో పెరిగిన అక్రమ నెట్‌వర్క్‌లు. వాటిని నిర్మూలించకపోతే సమస్య మళ్లీ మళ్లీ పునరావృతమవుతూనే ఉంటుంది. దేశంలో ప్రతి సంవత్సరం కోట్లాది మంది యువత ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్యా ప్రవేశాలకోసం వివిధ పోటీ పరీక్షలు రాస్తున్నారు. ఈ పరీక్షలు వారి జీవితాలను నిర్ణయించే కీలక మలుపులు.అలాంటి పరీక్షల్లో ప్రశ్నాపత్రం లీక్ కావడం అంటే కేవలం ఒక పరీక్ష రద్దు కావడం కాదు; అది ప్రతిభపై విశ్వాసానికి తూట్లు పొడవడం. నిజాయితీగా శ్రమించిన విద్యార్థిని, అక్రమ మార్గంలో ప్రశ్నాపత్రం సంపాదించిన వ్యక్తితో ఒకే స్థాయిలో నిలబెట్టడం. అంతకంటే పెద్ద అన్యాయం మరొకటి ఉండదు. ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా పలు పరీక్షల విషయంలో లీకేజీలు, అవకతవకలు, పునఃపరీక్షలు, న్యాయపోరాటాలు సాధారణ వార్తలుగా మారిపోయాయి. పరీక్ష ముగిసిన తర్వాత ఫలితాల కోసం ఎదురుచూడటానికి బదులు, 'లీక్ జరిగిందా?', 'పరీక్ష రద్దవుతుందా?', 'మళ్లీ పరీక్ష ఉంటుందా?' అనే సందేహాలతో విద్యార్థులు గడపాల్సివస్తోంది. ఇది పరీక్షా వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం క్రమంగా క్షీణిస్తున్నదనే ప్రమాదకర సంకేతం. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలనే నిర్ణయం ప్రకటించడం స్వాగతించదగినదే. నేరస్థులకు శిక్ష తప్పదనే సందేశం వెళ్లాలి. విచారణలు సంవత్సరాల తరబడి సాగి నిందితులు శిక్ష తప్పించుకునే పరిస్థితి ఉండకూడదు.అయితే ప్రశ్న ఏమిటంటే -శిక్ష వేగంగా పడితే లీకేజీలు ఆగిపోతాయా? గతంలో శిక్షలు లేవా? చట్టాలు లేవా? ఉన్నా నేరాలు ఎందుకు ఆగలేదు? సమాధానం స్పష్టమే. సమస్య చట్టాల్లో కాదు; వాటి అమలులో, వ్యవస్థ నిర్వహణలో, పర్యవేక్షణలో ఉంది. ప్రశ్నాపత్రం లీక్ అనేది ఒక్క వ్యక్తి చేసే నేరం కాదు. ప్రశ్నాపత్రం తయారీ, ముద్రణ, భద్రత, రవాణా, నిల్వ, పంపిణీ, పరీక్షా కేంద్రాల నిర్వహణ -ఇలా అనేక దశల్లో వందలాది మంది పాల్గొంటారు. ఈ గొలుసులో ఒక్క లింకు బలహీనపడినా మొత్తం వ్యవస్థ కుప్పకూలుతుంది. అందువల్ల ప్రతి దశలో సాంకేతిక భద్రత, డిజిటల్ పర్యవేక్షణ, బాధ్యతల స్పష్టత, స్వతంత్ర ఆడిట్ వంటి సంస్కరణలు అత్యవసరం. మరో కీలక అంశం ప్రశ్నాపత్రాల లీకేజీల వెనుక ఉన్న అక్రమ ఆర్థిక వ్యవస్థ. ఒక ప్రశ్నాపత్రం లీక్ కావడం వెనుక లక్షల రూపాయలు కాదు, కొన్ని సందర్భాల్లో కోట్ల రూపాయల లావాదేవీలు జరుగుతున్నాయనే ఆరోపణలు తరచూ వినిపిస్తున్నాయి. కొందరు దీనిని లాభదాయకమైన వ్యాపారంగా మార్చుకున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.అలాంటప్పుడు కేవలం లీక్ చేసిన వ్యక్తిని అరెస్టు చేయడం సరిపోదు. ఈ అక్రమ నెట్‌వర్క్‌లకు ఆర్థికంగా మద్దతు ఇస్తున్న వారిని, కుమ్మక్కైన అధికారులను, సంబంధిత సంస్థలను కూడా వెలికితీసి కఠినంగా శిక్షించాలి. అక్రమంగా సంపాదించిన ఆస్తులను స్వాధీనం చేసుకోవడం, సంస్థలను బ్లాక్‌లిస్ట్ చేయడం వంటి చర్యలు కూడా అవసరం. ఈ సంక్షోభంలో ఎక్కువ నష్టపోతున్నవారు విద్యార్థులే. ఒక పరీక్ష కోసం నెలలు, సంవత్సరాల పాటు సిద్ధమవుతారు. కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులను భరిస్తూ కోచింగ్ ఫీజులు చెల్లిస్తాయి. ఉద్యోగం కోసం వయోపరిమితి దగ్గరపడుతున్న అభ్యర్థులకు ప్రతి పరీక్ష అమూల్యమైన అవకాశం. అలాంటి సమయంలో పరీక్ష రద్దు కావడం అంటే వారి జీవితంలో ఒక సంవత్సరం వెనక్కి వెళ్లినట్టే. ఈ మానసిక ఒత్తిడి, ఆర్థిక నష్టం, సమయ నష్టానికి ఎలాంటి పరిహారం ఉండదు. కోర్టు తీర్పు వచ్చినా, నిందితులకు శిక్ష పడినా, విద్యార్థి కోల్పోయిన సమయం తిరిగి రాదు.కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా వ్యవస్థాగత సంస్కరణలను అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకోవాలి. పరీక్షల నిర్వహణకు స్వతంత్ర పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ప్రశ్నాపత్రాల భద్రతకు అంతర్జాతీయ ప్రమాణాలు అమలు చేయాలి. కృత్రిమ మేధస్సు, డిజిటల్ ట్రాకింగ్, బహుళస్థాయి ఎన్‌క్రిప్షన్ వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించాలి. ప్రతి పరీక్ష అనంతరం భద్రతా ఆడిట్ తప్పనిసరి చేయాలి. పరీక్షా సంస్థలు పారదర్శకంగా వ్యవహరించాలి. అనుమానాలు తలెత్తిన ప్రతిసారీ విద్యార్థులకు స్పష్టమైన సమాచారం అందించాలి. దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని ప్రతి ప్రభుత్వం చెబుతుంది. అయితే యువత ప్రతిభను కాపాడే పరీక్షా వ్యవస్థను నిర్మించడం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత. ప్రశ్నాపత్రాల లీకేజీలు కొనసాగుతుంటే ప్రతిభపై నమ్మకం తగ్గుతుంది. కష్టపడి చదవడం కంటే అక్రమ మార్గాలు వెతికే సంస్కృతి పెరిగే ప్రమాదం ఉంది. అది కేవలం విద్యా వ్యవస్థకే కాదు, దేశ నైతిక విలువలకు కూడా ముప్పు. అందుకే ఇప్పుడు అవసరమైంది ఫాస్ట్-ట్రాక్ కోర్టులు మాత్రమే కాదు; ఫాస్ట్-ట్రాక్ సంస్కరణలు కూడా. నేరం జరిగిన తర్వాత శిక్షించడం కంటే, నేరం జరగకుండా వ్యవస్థను నిర్మించడం ప్రభుత్వ అసలు విజయంగా నిలుస్తుంది. విద్యార్థులు కోరుకుంటున్నది ఆలస్యమైన న్యాయం కాదు; పరీక్షా హాల్లోకి అడుగుపెట్టిన ప్రతి అభ్యర్థి తన ప్రతిభతోనే విజయం సాధిస్తాడనే అచంచలమైన విశ్వాసం. ఆ విశ్వాసాన్ని పునరుద్ధరించగలిగితేనే విద్యా వ్యవస్థపై ప్రజల నమ్మకం నిలుస్తుంది. లేకపోతే ఫాస్ట్-ట్రాక్ కోర్టుల తీర్పులు వస్తూనే ఉంటాయి, కానీ ప్రశ్నాపత్రాల లీకేజీలు కూడా ఆగకుండా కొనసాగుతూనే ఉంటాయి. దేశ భవిష్యత్తును కాపాడాలంటే న్యాయాన్ని వేగవంతం చేయడం సరిపోదు; వ్యవస్థను సరిదిద్దే ధైర్యం ప్రభుత్వానికి ఉండాలి.

# యువతేజం అస్తమిస్తే దేశానికే నష్టం

కారణాలేమైనా సరే దేశాన్ని నడిపించాల్సిన యువతేజం ఎక్కడ ఏ ఆకాశం కొసన అస్తమించినా అది దేశానికి నష్టం, అరిష్టం అని విజ్ఞులు చెబుతుంటారు. అలాగే విద్యార్థులు నవ సమాజ నిర్మాతలని కవులు కీర్తిస్తుంటారు. ఈ నేపథ్యంలో చదువుల్లో ఉత్తీర్ణులు కాలేక ఓడిపోయామని కుంగుబాటుతో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటే ఆయా కుటుంబాల్లో రగులుకున్న క్షోభ ఎవరూ ఆర్పలేనిది, తీర్చలేనిది. ప్రవేశ పరీక్షలు (ఎంట్రన్స్ ఎగ్జామ్స్) ఒక ద్వారపాలకుడిలా పనిచేస్తాయి. భారతీయ యువతలో ఎవరికి భద్రమైన, అధికారిక ఉద్యోగాన్ని పొందే అవకాశం దక్కుతుందో నిర్ణయిస్తాయి. అయితే అనేక పరీక్షల్లో ప్రశ్నపత్రాలు వరుసగా లీక్ కావడం వల్ల ప్రతిభను పరీక్షించే వ్యవస్థ విస్తృతమైన అవినీతికూపంగా మారిపోవడం మొత్తం విద్యార్థి లోకాన్ని దారి తెన్నూ లేని చీకటి ప్రపంచం లోకి నెట్టుతోంది. నీట్ పరీక్ష ప్రశ్నావళి లీక్ కావడం, రద్దు చేసి మళ్లీ నిర్వహించడం ఈలోగా దాదాపు 20 మంది విద్యార్థులు మానసికంగా కుంగిపోయి బలవన్మరణాలకు పాల్పడడం దేశాన్ని ప్రస్తుతం తీరని విషాదంలో ముంచెత్తుతోంది.నీట్ పరీక్షలో ప్రశ్నపత్రాల లీకేజీ వంటి విద్యావ్యవస్థలో అస్తవ్యస్త పరిస్థితులపై కదంతొక్కిన కాక్రోచ్ జనతా పార్టీ చివరకు మోడీ ప్రభుత్వం మెడలువంచి డిమాండ్లను సాధించుకున్న సంఘటన చారిత్రాత్మకం. ఈ డిమాండ్లలో ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు రూ. కోటి వంతున పరిహారం చెల్లించడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. ఇటువంటి డిమాండ్లు పరిష్కారం కానున్నాయన్న సంతృప్తి పడితే ఇంకా పట్టిపీడిస్తున్న సమస్యలు పరిష్కారం అయినట్టు కాదు. నీట్ పరీక్ష వంటి ముఖ్యమైన పరీక్షలతో ముడిపడి ఉన్న అనేక సమస్యలు ఇంకా పరిష్కారం కాకుండా మిగిలి ఉన్నాయి. వీటిపై కూడా కాక్రోచ్ జనతాపార్టీ వంటి జెన్‌జెడ్ ఉద్యమాలు దృష్టి కేంద్రీకరించవలసిన అవసరం ఉంది. గత మేనెల మొదటి వారంలో నీట్ పరీక్షకు దాదాపు 20 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. అయితే ఈ పరీక్ష రద్దయిన తరువాత దాదాపు 20 మంది అభ్యర్థులు బలవన్మరణాలకు పాల్పడినట్టు అంచనా. ఈ ఆత్మహత్యలను కేవలం ఒకరి వ్యక్తిగత సమస్య కారణంగా చూపలేం.వీటి వెనుక సామాజిక, ఆర్థిక పరిస్థితులతోపాటు వ్యవస్థాపక ఒత్తిళ్లు కూడా ప్రధానంగా ప్రభావితం




చేస్తున్నాయి. 2014 2024 మధ్యకాలంలో 1.23 లక్షల మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు. చదువుల్లో ఒత్తిడి, కుటుంబ సమస్యలు, మానసిక ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, వ్యక్తుల మధ్య సంఘర్షణ తదితర కారణాలే విద్యార్థుల ఆత్మహత్యలకు దారి తీశాయని, పార్లమెంట్‌లో కేంద్ర విద్యామంత్రిత్వశాఖ వెల్లడించడం గమనార్హం. దేశం మొత్తం మీద ప్రమాదాల వల్ల మరణాలు, ఆత్మహత్యలు (ఎడిఎస్ఐ)పై నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో వెల్లడించిన నివేదిక ప్రకారం ఆత్మహత్యలకు దారి తీసిన పరిస్థితుల్లో 'పరీక్షల్లో విఫలమవ్వడం అనే అంశాన్ని ఇతర కారణాలతో కలపకుండా ఒక ప్రత్యేకమైన, స్పష్టమైన కారణంగా గుర్తించడమైంది.దీన్ని బట్టి 2014 నుంచి 2024 వరకు జరిగిన మొత్తం విద్యార్థుల ఆత్మహత్యల్లో 21 శాతం మంది పరీక్షల్లో ఫెయిలవ్వడం వల్లనే జరిగాయని నివేదికలు చెబుతున్నాయి. ఈ కారణంగానే ఏటా 2000 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోగా, 2014 2024 మధ్యకాలంలో 25,000 మంది పరీక్షల్లో తప్పిపోవడం వల్లనే ఆత్మహత్యలకు పాల్పడ్డారని తేలింది. వీరిలో 55 శాతం మంది 18 ఏళ్ల లోపు వారు కాగా, మరో 42 శాతం మంది 18 నుంచి 30 ఏళ్ల లోపు వారే. విద్యార్థుల ఆత్మహత్యలను కేవలం నీట్ పరీక్ష కోణంలోనే చూడలేం కానీ అత్యంత పోటీతో కూడిన ఈ నీట్ వైద్య ప్రవేశ పరీక్ష వ్యవస్థాగత అస్తవ్యస్త సమస్యలకు ప్రతీకగా మారింది. పేపర్ లీక్ కావడం, పరీక్ష హాలులోకి ప్రవేశించేటప్పుడు విద్యార్థులను అనుమానంగా తనిఖీ చేయడం, కేవలం కొన్ని కేంద్రాల నుండి మాత్రమే విద్యార్థులు అసాధారణ రీతిలో అత్యధికంగా మార్కులు సాధించడం, తదితర అనూహ్య పరిస్థితులు వివాదాలకు దారి తీస్తున్నాయి. 2015 నుంచి ఏటా 15 లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్షలకు రిజిస్టర్ చేసుకుంటున్నారు. వీరిలో అర్హత సాధించిన అభ్యర్థుల జాబితాలో చోటు దక్కించుకున్నవారు 57 శాతం కంటే తక్కువగా ఉండడం గమనార్హం. అభ్యర్థులకు ప్రైవేట్ కోచింగ్ తప్పనిసరి అవుతోంది. అంతేకాదు చాలా మంది అర్హత సాధించడానికి మరో ఒకటి రెండు సంవత్సరాలు చదివి పరీక్షను మళ్లీ రాయవలసి వస్తోంది. ఈ పరిస్థితులు ఆయా కుటుంబాలపై తీవ్రమైన ఆర్థిక భారాన్ని మోపుతున్నాయి. సెకండరీ, హయ్యర్ సెకండరీ విద్యార్థుల్లో 35 శాతం మంది ప్రయివేట్ కోచింగ్ తీసుకుంటున్నారు. చదువులకు ఆయా కుటుంబాలు పెట్టే మొత్తం ఖర్చులో దాదాపు మూడో వంతు అంటే 33 శాతం ప్రయివేట్ కోచింగ్‌ల కోసమే వెచ్చించవలసి వస్తోంది. కాక్రోచ్ జనతా పార్టీ పిలుపుతో దేశమంతా విద్యార్థులు, యువకులు, వారి తల్లిదండ్రులు కదం తొక్కి తమ డిమాండ్లను సాధించుకున్నప్పటికీ, విద్యార్థుల బలవన్మరణాలకు దారితీస్తున్న వాస్తవ సమస్యల మూలాలను కూకటివేళ్లతో పెకలిస్తేనే కానీ యువకుల భవితవ్యానికి మంచిరోజులు రావు. ప్రభుత్వ వ్యవస్థల్లోని లోపాలపై చెలరేగే ఎలాంటి ఆందోళనలైనా కట్టడి చేయడానికి లేదా అణచి వేయడానికి ప్రభుత్వం ఎంత ప్రయత్నిస్తున్నా వాస్తవంలో వాటి పర్యవసానాలు, తీవ్ర పరిణామాలు సమాజంలో చాలా దూరం వరకు విస్తరిస్తాయి. ఇకనైనా మోడీ ప్రభుత్వం ఈ వాస్తవాన్ని గ్రహించగలిగితేనే దేశంలో సామాజిక సామరస్య వాతావరణం ఏర్పడుతుంది.

# రాజకీయంగా ప్రభావం చూపే స్థాయికి సీజేపీ

భారత రాజకీయ చరిత్రలో ఎన్నో విచిత్ర విలక్షణమైన ఉద్యమాలు వచ్చాయి కానీ, ఛాత్రోర్ జనతా పార్టీ సృష్టించిన రాజకీయ సంచలనం ఇవాళా ముసురుతోందా లేదనడంలో సందేహం లేదు. భక్త్యాంధ్రప్రభాస్‌ను రాజీనామా చేయించడంలో కీలక పాత్ర పోషించింది. దెబ్బకి కేంద్ర ప్రభుత్వాన్ని మోకాళ్లపైకి తెచ్చింది. మాజీ ప్రభుత్వం ఏకంగా చేతన విద్యాలయ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేత రాజీనామా చేయించక తప్పని పరిస్థితి ఏర్పడింది. సోషల్ మీడియా హవాగా పుట్టిన ఛాత్రోర్ జనతా పార్టీ ఉద్భవించడాని కన్నా కేంద్రం ఒక కేబినెట్ మంత్రిని పదవి నుండి తప్పించడమే అంటే, సీజేపీ డిమాండ్ల ప్రభావమే కాదు... దాని రాజకీయ ఉనికికి కూడా కేబినెట్ స్వయంగా చట్టబద్ధత కల్పించినట్లయింది. కేవలం విద్యార్థి పోరాటాలు, మోర్చాలు, సోషల్ మీడియా క్యాంపైన్లకే పరిమితమైన సీజేపీ, ఇప్పుడు అధికారికంగా రాజకీయ పార్టీ గా అవతరిస్తే భారత రాజకీయాలు ఏ విధంగా మారతాయనేది ప్రస్తుతం ఢిల్లీ పొలిటికల్ సర్కిళ్లల్లో ఆసక్తికరమైన టాపిక్. గతంలో అన్నా హజారే ఇండియా అగైనెస్ట్ కరప్షన్ ఉద్యమం నుండి ఉద్భవించిన ఆమ్ ఆద్మీ పార్టీ ఎలాగైతే ఒక రాత్రిలో సంప్రదాయ రాజకీయాలను కుదిపేసిందో, ఇప్పుడు సీజేపీ కూడా సరిగ్గా అదే తరహా యాంటీ-ఎస్టాబ్లిష్‌మెంట్ ఎలక్టోరల్ ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్న ఆస్కారాలు ఉన్నాయి. రాజకీయ అంచనాలు వేయడం తెలిసినవాళ్లు అయితే... రేపు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చెప్పడం కష్టం. యువత, ముఖ్యంగా జెన్-జీ, మెజారిటీల్లో అండగా ఉన్న ఈ పార్టీ పొలిటికల్ ఎంట్రీ... ఇప్పటికీ తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న ప్రతిపక్షాలకు సింహస్వప్నంగా మారనుంది. వాస్తవానికి, సీజేపీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తే భయపడాల్సింది అధికార బీజేపీ కంటే కూడా కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలే. ఎందుకంటే, కేంద్రంలో మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, యువత నిరుద్యోగం, పేపర్ లీకేజీలు, విద్యావ్యవస్థలోని లోపాలపై పోరాడే విపక్ష స్పేస్ ని ఇన్నాళ్లూ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ ఆక్రమించే ప్రయత్నం చేశాయి. అయితే, రాహుల్ గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ కానీ, వరుస వివాదాల్లో చిక్కుకున్న ఆమ్ ఆద్మీ సాధించలేని భారీ రాజకీయ విజయాన్ని సీజేపీ సాధించి చూపించింది. దీనివల్ల ప్రతిపక్షాల వైపు ఉండాల్సిన యువతరం డిజిటల్ అటెన్షన్, అర్బన్ ఓటు బ్యాంకు మొత్తం సీజేపీ వైపే మొగ్గు చూపే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ విషయానికొస్తే, నగరాల్లోని విద్యార్థిపోరు, యువత ఓట్లను రాబట్టడానికి ఆ పార్టీ ఎంతో కాలంగా పడుతున్న కష్టాలు సీజేపీ ఎంట్రీతో బూడిదలో పోసిన పన్నీరు కానున్నాయి. విద్యార్థుల కోసం తాము క్షేత్రస్థాయిలో ఏమీ చేయలేకపోయామనే భావన ఓటర్లలో బలపడటం కాంగ్రెస్‌కు కోలుకోలేని దెబ్బ కాబోతోంది. తమను తాము విద్యార్థుల, మధ్యతరగతి ప్రతినిధులుగా ప్రొజెక్ట్ చేసుకునే ఆమ్ ఆద్మీ పార్టీ ఉనికికి సీజేపీ పేను సవాలుగా పరిణమించనుంది. ఆమ్ పాతబడిపోయిన పాత్యాల స్థానంలో, సరికొత్త డిజిటల్ విప్లవంతో, సోషల్ మీడియా స్ట్రాటజీలతో దూసుకుపోతున్న సీజేపీ, ఢిల్లీ, ఇతర మెట్రో నగరాల్లో ఆమ్ ఆద్మీ ఓట్ బ్యాంక్‌ను ఎసరు పెట్టడం ఖాయం. ఈ సరికొత్త పరిణామం ప్రధాని నరేంద్ర మోడీ మాస్టర్ స్ట్రోక్‌లో భాగమనే విశ్లేషణలు కూడా లేకపోలేదు. అభిజిత్ దీప్య ప్రారంభించిన 'ఛాత్రోర్ జనతా పార్టీ' ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జూన్ 6న తన తొలి నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. నీట్ పరీక్ష నిర్వహణలో లీకేజీ, వర్సిటీల్లో అవకతవకలు, విద్యార్థుల భవిష్యత్తుపై నిరసనకారులు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ ఆందోళన ఒక పెద్ద ఉద్యమానికే ఆరంభం మాత్రమేనని అభిజిత్ దీప్య వ్యాఖ్యానించారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం నుంచి సంతృప్తికరమైన సమాధానం రాకపోవడంతో, జూన్ 20న ఛాత్రోర్ జనతా పార్టీ సభ్యులు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిరవధిక నిరసనను ప్రారంభించారు. వర్సిటీ ప్రవేశపరీక్షల లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పరీక్షా విధానంలో సంస్కరణలు తీసుకురావడం తదితర డిమాండ్లు కేంద్రం ముందుంచారు. అయితే, 'పార్లమెంట్ మార్చ్'కు సీజేపీ ఎలాంటి అనుమతి కోరలేదని, పోలీసులు అనుమతి ఇవ్వలేదని జులై 19న ఢిల్లీ పోలీసులు ప్రకటించారు. జులై 20న, వేలాది మంది నిరసనకారులు జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లడానికి ప్రయత్నించారు. ఆ సమయంలో గుంపును చెదరగొట్టడానికి పోలీసులు బాష్పవాయువు, లాఠీఛార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఆ ఘటనలో కొందరు యువకులు, పోలీసులు గాయపడ్డారు. దీంతో, పోలీసులు తీసుకున్న పలు చర్యల తీవ్రతను కొన్ని అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు కూడా తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేశాయి. ఆ తర్వాత జులై 21 నుంచి 23 మధ్య




జంతర్ మంతర్ ప్రాంతంలో భద్రతను కఠినతరం చేశారు, పలు మెట్రో స్టేషన్లను మూసివేశారు. పోలీసులు చర్యలపై ఢిల్లీ హైకోర్టు వివరణ కోరింది. ఆ తర్వాత కేంద్ర మంత్రులు నిరసన స్థలానికి సమావేశం కావడం ఒక అరుదైన ప్రదేశంలో సీజేపీ ప్రతినిధులతో చర్చలు ప్రారంభించారు. జులై 24న, సోమనాథ్ వాగ్మారే ప్రభుత్వం తరఫున నిరసనస్థలంలో బీసీ వర్గాల, ఉపేంద్ర సింగ్ సమక్షంలో తన నిరాహార దీక్షను విరమించారు. అయితే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని సీజేపీ ప్రకటించింది. డిమాండ్లపై సమాధానం ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వానికి ఒకరోజు వరకు సమయం కోరిందని జులై 24న జరిగిన చర్చల ముగింపులో సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్ తెలిపారు. రాజ్యాంగబద్ధంగా, పరీక్షా విధానంలో సంస్కరణల డిమాండ్లను స్పష్టంగా చేశామని, ఈ పరిణామాన్ని సీజేపీ ఒక భారీ విజయంగా అభివర్ణించిందనేది ప్రజాస్వామ్య విజయం, ఇది శాంతి, ఓర్పు, సత్యంలకు లభించిన విజయం" అని సోమనాథ్ వాగ్మారే వ్యాఖ్యానించారు. "ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని, కానీ నీట్ పరీక్ష అక్రమాల కారణంగా ఆత్మహత్య చేసుకుని ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం అందించాలి, నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై లాఠీఛార్జ్ చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి అనే రెండు డిమాండ్లు ఇంకా మిగిలే ఉన్నాయి" అని అభిజిత్ దీప్య తెలిపారు. విద్యాశాఖ మంత్రి రాజీనామాను ఆమోదించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం కేవలం ప్రజాస్వామ్యబద్ధంగా స్పందించాం అనే ఇమేజ్‌ను తెచ్చుకోవడమే కాకుండా, విపక్ష ఓట్లను చీల్చే మరొక కొత్త శక్తిని పరోక్షంగా ప్రోత్సహించినట్లయింది. ప్రతిపక్షాల ఐక్యత దెబ్బతింటున్న తరుణంలో, ఒక స్వతంత్ర యువజన పార్టీ రూపంలో మరో శక్తి రావడం వల్ల విపక్ష ఓటు బ్యాంకు ఘోరంగా చీలిపోయి, చివరికి అది అధికార పార్టీకే రాజకీయంగా లబ్ధి చేకూరుస్తుందనే వాదన ఉంది. ఛాత్రోర్ జనతా పార్టీ రాజకీయ పార్టీగా మారుతుందో లేదో ఎవరికీ తెలియదు. కానీ సంప్రదాయ రాజకీయ సమీకరణాలు, పాతతరం ప్రచార శైలి చెల్లవని, ప్రజల్లోంచి వచ్చిన ఆవేశం సరికొత్త రాజకీయ శక్తులను జన్మనిస్తుందని ఇది నిరూపించింది. రాబోయే ఎన్నికల్లో సీజేపీ నిజంగానే పార్టీ గుర్తుతో బరిలోకి దిగితే, అది కేవలం విద్యావ్యవస్థలోనే కాదు, దేశ రాజకీయాల్లో కూడా ఒక పెద్ద ప్రక్షాళనకు కారణమవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

డ్రీమ్ టైమ్స్
తెలుగు దిన పత్రిక
DREAM TIMES DAILY NEWS PAPER
బుధవారం
29-07-2026



# తాగునీటికే తొలి ప్రాధాన్యం

**- జిల్లా కలెక్టర్ ఆనంద్**

**-నింబగల్లు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**-తుంగభద్ర నుంచి వచ్చే నీటిని పూర్తిగా తాగునీటికే వినియోగించాలని నిర్ణయం**

**-వ్యవసాయానికి నీటి సరఫరా సాధ్యం కాదని స్పష్టం**

**-రైతులు తక్కువ నీటితో సాగయ్యే పంటలు సాగు చేయాలని సూచన**

**-బహువార్షిక పంటలకు మైక్రో ఇరిగేషన్ వినియోగించాలని విజ్ఞప్తి**



**ఉరవకొండ రూరల్,జూలై 28 (డ్రీమ్ టైమ్స్):** జిల్లాలో రాబోయే సీజన్ లో తాగునీటికి సంబంధించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నింబగల్లు గ్రామం వద్ద ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ను జిల్లా కలెక్టర్ ఆనంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ? త్రాగునీటికి సంబంధించి జిల్లాలో రాబోయే సీజన్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండడానికి, ఒకసారి తనిఖీ చేయడం జరిగిందన్నారు.జిల్లాలో డ్రింకింగ్ వాటర్ స్కీమ్స్ మేజర్ గా ఆర్.డబ్ల్యు.ఎస్ కి సంబంధించి కొన్ని ఉన్నాయని, అదేకాకుండా సత్యసాయి వాటర్ సప్లై బోర్డువి కూడా ఉన్నాయని, వీటన్నింటికి కూడా నీళ్లు హెచ్.ఎల్.సి కెనాల్ నుంచి డ్రా చేయడం జరుగుతాయన్నారు. రాబోయే నెలలో మనకు తుంగభద్ర నుంచి రిలీజ్ ఉండటానికి అవకాశాలు ఉన్నాయి కాబట్టి, ఆ నీటిని 100 శాతం డ్రింకింగ్ వాటర్ కి వాడుకుంటామని అనుకున్నామని, దానికి సంబంధించిన తగు చర్యలు తీసుకున్నామన్నారు. ఆయా శాఖలకు కూడా దానికి సంబంధించిన ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈసారి ఎటువంటి పరిస్థితిలో వ్యవసాయానికి నీళ్లు ఇవ్వడానికి వీలవ్వదని, ఈ సీజన్ లో వర్షాభావంతో రెగ్యులర్ గా మన దగ్గర డ్రింకింగ్ వాటర్ కోసం ఉన్న ట్యాంక్స్ లో ఉన్న నీళ్లు కూడా చాలా తక్కువ ఉన్నాయని, రైతులందరూ కూడా దీనిని సహకరించాలని కోరుతున్నామన్నారు. మొదటి ప్రాధాన్యత త్రాగునీటికే పెట్టుకుంటామన్నారు. తాగునీటికి పెట్టుకున్న తర్వాత ఏదైనా అవకాశం దొరికినట్లయితే, అప్పుడు ఖచ్చితంగా ఏదైనా సహాయం చేయగలుగుతాం కానీ, ప్రస్తుతానికి అయితే మాత్రం 100 శాతం తాగునీటికే ప్రాధాన్యత ఇస్తామని ప్రతి ఒక్కరికీ కూడా తెలియజేస్తున్నామన్నారు. అదేకాకుండా రైతులు వీలైనంత వరకు మీరు ఐడి క్రాప్ కి వెళ్ళండి.. ఐడి క్రాప్ కాకుండా, ఒకవేళ ప్రస్తుత బహువార్షిక పంటలు (ఎగ్జిస్టింగ్ పెరినియల్ క్రాప్స్) ఉన్నట్లయితే, ఖచ్చితంగా మైక్రో ఇరిగేషన్ ద్వారా చేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎల్.సి ఎస్ఈ సుధాకర్ రావు, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ శ్రీనివాసులు, ఆర్ డబ్ల్యు ఎస్ డి ఈ ఈ అంజుమన్ సల్ఫీన్, ఉరవకొండ తహసిల్దార్ అరుణ, ఆర్ డబ్ల్యు ఎస్ జేఈ ఐజయ్య, సైట్ ఇంజనీర్ ద్రాక్షాయిని, డిప్యూటీ ఎంపీడీవో మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీ..

**-ప్రీ-స్కూల్ బోధనకు టీవీ వినియోగించాలని ఆదేశం**




**కర్నూలు, జూలై 28 (డ్రీమ్ టైమ్స్):** కర్నూలు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ పి.విజయ మంగళవారం పత్తికొండ మండలంలోని కనకదిన్నె అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు.సందర్శన సందర్భంగా ప్రభుత్వం అందజేసిన టెలివిజన్‌ను ప్రీ-స్కూల్ విద్యా కార్యక్రమాల కోసం వినియోగించడం లేదని గుర్తించారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధి కోసం ప్రతిరోజూ టీవీ ద్వారా ప్రీ-స్కూల్ విద్యా కార్యక్రమాలు నిర్వహించాలని అంగన్‌వాడీ కార్యకర్తకు ఆదేశాలు జారీ చేశారు.అదేవిధంగా కేంద్రంలో విద్యుత్ బల్బు లేకపోవడంతో వెంటనే బల్బు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వం అందజేసిన అన్ని సౌకర్యాలు, పరికరాలను సమర్థవంతంగా వినియోగించి చిన్నారులకు నాణ్యమైన సేవలు అందించాలని విజయ సూచించారు.

# రైతులు కంది పంట సాగు చేసుకోండి..




**రాప్తాడు, జూలై 28 (డ్రీమ్ టైమ్స్):** రాప్తాడు మండల పరిధిలోని ప్రసన్నాయనపల్లి, గొందిరెడ్డిపల్లి గ్రామాల్లో కంది వేరుశనగ ఇతర పంట పొలాలను మండల వ్యవసాయ శాఖ అధికారి కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో రేకులకుంట ప్రధాన శాస్త్రవేత్త మల్లేశ్వరి హైదరాబాదు నామ్ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తలు నిర్మల శ్రీకాంత్ మురళీకృష్ణ విద్యావతి పరిశీలించారు.ఈ సంధర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ పిఆర్జీ-176(ఉజ్వల) ఎల్ఆర్జీ-105(కృష్ణ) కంది రకాలు ఎండు తెగులు మరియు గొడ్డు తెగులును తట్టుకుంటాయని తెలిపారు. అందువలన రైతులు ఈ రకాలను సాగు చేసుకోవాలని సూచించారు. కంది విత్తే ముందుగా టి.విరిడి మరియు మ్యాన్కోజెబ్ -3/కేజీ విత్తనానికి విత్తన శుద్ధి చేసుకోవాలని తెలియజేశారు.కంది పంట లో నల్లి నివారణకు వెట్టాబ్లి సల్ఫర్-3 గ్రాములు/లీటర్ నీటికి పిచికారీ చేసుకోవాలని అన్నారు. అనంతరం గొందిరెడ్డిపల్లి గ్రామానికి కేవీకే రెడ్డిపల్లి శాస్త్రవేత్త మాధవి వర్షాధారిత వేరుశనగ పంట ను సందర్శించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్.కృష్ణ చైతన్య జి.కొత్తపల్లి రామానాయుడు ఏఈఓ లు సుజిత రంజిత ఆర్ ఎస్.కె ఉద్యోగులు సోనియా రాజు రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ పకృతి పరిరక్షణ దినోత్సవం..



**ఉరవకొండ రూరల్, జూలై 28 (డ్రీమ్ టైమ్స్):** ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఉరవకొండలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వజ్రకరూరు మండలంలోని కదమల కుంట గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎన్. నారాయణస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన అత్త శ్రీమతి ఎన్. వసుంధరాదేవి స్మారకార్థం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ.10,000 విలువైన 20 కుర్చీలను విరాళంగా అందజేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందించడంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశేష సేవలు అందిస్తోందని కొనియాడారు.కళాశాలలో నిర్వహిస్తున్న విద్యా, సామాజిక సేవా కార్యక్రమాలను ప్రశంసిస్తూ, విద్యార్థులు ప్రదర్శించిన క్రమశిక్షణ, ప్రతిభ, ఉత్సాహాన్ని అభినందించారు. ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పర్యావరణాన్ని కాపాడేందుకు మొక్కల పెంపకం, నీటి సంరక్షణ వంటి కార్యక్రమాలలో యువత ముందుండాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. శైలజా రాణి మాట్లాడుతూ, గ్రామీణ కళాశాల అభివృద్ధికి డా. నారాయణస్వామి అందించిన సహకారానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన చేసిన విరాళం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. సీనియర్ అధ్యాపకులు డా. టి. ఎన్. మస్తానప్ప మాట్లాడుతూ వసుంధరాదేవి స్మారకార్థం కళాశాలకు విరాళం అందించడం ద్వారా డా. నారాయణస్వామి చూపిన కృతజ్ఞతా భావం ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కార్యక్రమాధికారులు సుధాకర్ మరియు విష్ణుప్రియ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కళాశాల ఆవరణలో మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వెంకట రాముడు, వెంకటేశులు, సుజాత, రామాంజినేయులు, అనిల్, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీ అవకతవకలపై వైఎస్ఆర్సీపీ ఆందోళన..

**విద్యార్థి సమస్యల పరిష్కారం కోరుతూ పుట్టపర్తిలో భారీ నిరసన ర్యాలీ**



**శ్రీ సత్యసాయి బ్యూరో,జూలై 28 (డ్రీమ్ టైమ్స్):** విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, డీఎస్సీ నియామకాల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో మంగళవారం పుట్టపర్తిలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. డీఎస్సీ నియామక ప్రక్రియలో పారదర్శకత పాటించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించిన నాయకులు, ఈ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా గణేష్ సర్కిల్ వరకు సాగింది. పార్టీ జెండాలు, ప్లకార్డులు చేతబట్టి పెద్ద సంఖ్యలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆరోపిస్తూ, డీఎస్సీ నియామక ప్రక్రియలో చోటుచేసుకున్నట్లు చెబుతున్న అక్రమాలపై హైకోర్టు పర్యవేక్షణలో లేదా స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ యువత తీవ్ర ఆందోళనలో ఉందన్నారు. ఉద్యోగాల భర్తీలో పారదర్శకత లేకపోవడం వల్ల అభ్యర్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి డీఎస్సీ నియామకాలకు సంబంధించిన అన్ని వివరాలను బహిర్గతం చేయాలని, అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలను విస్మరించి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, హాస్టల్ సౌకర్యాల కల్పన వంటి అంశాలపైనా ప్రభుత్వం దృష్టి సారించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం నిరుద్యోగులను నిరాశకు గురిచేసిందని ఆరోపించారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత ప్రయోజనాలను కాపాడేందుకు వైఎస్సార్‌సీపీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ర్యాలీలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్పతో పాటు పలువురు పార్టీ నాయకులు, యువజన, విద్యార్థి విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ర్యాలీ అనంతరం గణేష్ సర్కిల్‌లో నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. డీఎస్సీ అవకతవకలపై పారదర్శక విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కొంతసేపు ఆందోళన కొనసాగడంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అనంతరం పోలీసులు పరిస్థితిని చక్కదిద్దగా నిరసన శాంతియుతంగా ముగిసింది.

# దువుతోపాటు క్రీడలు ముఖ్యమే: ఎం.డి కృష్ణ భరత్




**రాప్తాడు, జూలై 28 (డ్రీమ్ టైమ్స్):** సీబీఎస్ఈ క్లస్టర్-7 ఖోఖో క్రీడా పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన మాంటిస్సోరి ఎలైట్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థినులను పాఠశాల ఎండీ కృష్ణ భరత్, కరస్పాండెంట్ కృష్ణ సమీర అభినందించారు. ఈ సందర్భంగా ఖోఖో కోచ్ వీరన్నను ప్రత్యేకంగా సన్మానించి అభినందనలు తెలిపారు. రాప్తాడు మండలం గొల్లపల్లి గ్రామ సమీపంలోని మాంటిస్సోరి ఎలైట్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో విజేతల అభినందన సభ నిర్వహించారు. పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులు ఈ నెల 23 నుంచి 26 వరకు కరీంనగర్ జిల్లాలోని ఆల్ఫోర్స్ స్కూల్‌లో నిర్వహించిన సీబీఎస్ఈ క్లస్టర్-7 ఖోఖో పోటీల అండర్-17 విభాగంలో ఇంటర్‌స్టేట్ స్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి దాదాపు 64 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయని పేర్కొన్నారు. ఇంటర్‌స్టేట్ స్థాయిలో విజేతలుగా నిలిచిన ఈ విద్యార్థినులు సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 4 వరకు చెన్నైలోని వేలమ్మల్ విద్యాలయంలో జరగనున్న జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రతాప్ రెడ్డి, ఖోఖో కోచ్ వీరన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

# తరిమెల నాగిరెడ్డి జీవితం ఆదర్శవంతం

**- గుంతకల్లులో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో నాగిరెడ్డి 50వ వర్ధంతి**



**గుంతకల్లు, జూలై 28 (డ్రీమ్ టైమ్స్):** తరిమెల నాగిరెడ్డి జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శవంతమని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి సురేష్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో తరిమెల నాగిరెడ్డి 50వ వర్ధంతి నిర్వహించారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయం నుండి 60 అడుగుల రోడ్డు,పొట్టి శ్రీరాములు సర్కిల్, భగత్ సింగ్ సర్కిల్, పాత గుంతకల్లు మీదుగా బీరప్ప కళ్యాణ మండపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ గుంతకల్లు డివిజన్ కమిటీ కార్యదర్శి బి సురేష్ మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో జన్మించి పీడిత ప్రజల విముక్తి కోసం సమసమాజ స్థాపన కోసం తన సర్వస్వాన్ని త్యాగం చేసిన గొప్ప విప్లవకారుడు తరిమెల నాగిరెడ్డి అన్నారు. ఆయన మూడుసార్లు ఎమ్మెల్యేగానూ ఒకసారి ఎంపీగా గెలిచి చట్టసభలలో తన గళాన్ని వినిపించారన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం తన 12 సంవత్సరాల పరిపాలనలో కార్పొరేట్ కంపెనీలకు పెట్టుబడిదారుకు బహుళ జాతి కంపెనీలకు లక్షల కోట్లు విలువైన జాతి సంపదను దోచి పెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో శివయ్య, చంద్రమ్మ, మహేష్, నరసప్ప, కదిరప్ప, అనిల్, పొన్నూరు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# 1130 గ్రాముల గంజాయి స్వాధీనం



**గుంతకల్లు, జూలై 28(డ్రీమ్ టైమ్స్):** గుంతకల్లు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని గుత్తి మండలం, కొత్త ఉబిచర్ల గ్రామంలో గంజాయి కలిగిన ఇరువురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుండి 1130 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు గుత్తి సీఐ రామారావు, ఎస్సై సురేష్ లు తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం విలేకరులతో మాట్లాడారు.గంజాయి విక్రయించిన సేవించినా, సాగు చేయడానికి ప్రయత్నించినా చట్టపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. గంజాయి సమాచారం తెలియజేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

## ఆంధ్రప్రదేశ్ స్వీట్స్ కార్పొరేషన్ చైర్మన్ ను మర్యాదపూర్వకంగా కలిసిన చైర్మన్ రేచర్ల నాగేంద్ర.



**శిరివెళ్ళ (డ్రీమ్ టైమ్స్)**
ఆంధ్రప్రదేశ్ స్వీట్స్ కార్పొరేషన్ చైర్మన్, మహారాష్ట్ర ఔరంగాబాద్ కలెక్టర్ డి.స్వామి ని నంద్యాలలోని గెస్ట్ హౌస్ లో నంద్యాల బిఒంగోలు జాతీయ రహదారిలో ఆహ్లాదాన్ని పంచే పచ్చని చెట్ల మధ్య వెలసిన సర్వ నరసింహా స్వామి ఆలయ చైర్మన్ రేచర్ల నాగేంద్ర, సిబ్బంది చిన్న మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం ఏపీ స్వీట్స్ కార్పొరేషన్ చైర్మన్ డి స్వామిని మర్యాదపూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ, పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఆలయ అభివృద్ధి పనుల గురించి మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా అభివృద్ధి పనులు మధ్యలోనే ఆగిపోయాయని ధ్వజస్తంభం తదితర ప్రధానమైనటువంటి కొన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలు, దేవాదాయ పరిసరాలు, పారిశుద్ధ్యం, త్రాగునీరు, వంటివి అభివృద్ధికి నేర్చుకోవడం లేదని ఆయన తెలిపారు.ఆగిపోయిన అభివృద్ధి పనులు తిరిగి ప్రారంభించేలా తగిన చర్యలు తీసుకోవాలని, మీ సహకారం ఎల్లప్పుడూ ఉండాలని ఆయన కోరారు.

## కమలాపురంలో డాక్టర్ పత్తి హిమబిందు 'ఇంటింటి ప్రచారం'



కమలాపురం నియోజకవర్గంలో
ఇంటింటి ప్రచారంలో డాక్టర్ పత్తి హిమబిందు

**గుంతకల్లు, జూలై 28 (డ్రీమ్ టైమ్స్):**
గుంతకల్లుకు చెందిన టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కడప జిల్లా, కమలాపురం నియోజకవర్గ టిడిపి అబ్జర్వర్ డాక్టర్ పత్తి హిమబిందు మంగళవారం కమలాపురం నియోజకవర్గంలోని 86,87 పోలింగ్ బూత్ ల పరిధిలోని ఓబుళంపల్లి, గురంపాడు, వి.ఎన్. పల్లి గ్రామాల్లో పర్యటించి టిడిపి ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రం పంపిణీ చేశారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలు, అవసరాలు, అభిప్రాయాలను తెలుసుకొని ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు టిడిపి మండల కన్వీనర్ భాస్కర్ రెడ్డి, టిడిపి నాయకులు, క్లస్టర్ ఇన్చార్జులు, యూనిట్ ఇన్చార్జిలు, బూత్ ఇన్చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

## 30న కసాపురం ఆలయ హుండీ లెక్కింపు



**గుంతకల్లు, జూలై 28(డ్రీమ్ టైమ్స్):**
మండల పరిధిలోని కసాపురం గ్రామంలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈనెల 30వ తేదీన హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్/ఈఓ మేడేపల్లి విజయరాజు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయనకు పత్రికా ప్రకటన విడుదల చేశారు.

## డాక్యుమెంట్ రైటర్ల సమ్మెకు జగదీష్ సంఘీభావం



**గుంతకల్లు, జూలై 28(డ్రీమ్ టైమ్స్):**
గుంతకల్లులో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న డాక్యుమెంట్ రైటర్ల నిరవధిక సమ్మెకు మంగళవారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి. జగదీష్ తన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్ రైటర్ల దీక్షా శిబిరం వద్ద ఆయన మాట్లాడుతూ డాక్యుమెంట్ రైటర్ల జీవితాలతో చెలగాటమాడుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి బుద్ధి వచ్చే విధంగా విజయవాడ ధర్నా చౌక్ దద్దరిల్లేలా ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం డాక్యుమెంటరీలతో త్వరితగతిన చర్చలు జరిపి వారి న్యాయమైన కోరికలు తీర్చాలని డిమాండ్ చేశారు.

# 'ఇంటింటికీ తెలుగుదేశం'లో గుమ్మనూరు నారాయణస్వామి

**గుంతకల్లు, జూలై 28(డ్రీమ్ టైమ్స్):**
గుంతకల్లు మున్సిపాలిటీ పరిధిలోని 29 వ వార్డులో మంగళవారం నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు, గుంతకల్లు టిడిపి ఇంచార్జి గుమ్మనూరు నారాయణస్వామి పాల్గొన్నారు. అబ్జర్వర్ హరిబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వార్డులో నూతనంగా నిర్మించనున్న రూ.5 లక్షల సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వార్డులోని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే గుంతకల్లు పట్టణంలో చేపట్టిన సీసీ రోడ్లు, తాగునీటి సౌకర్యం, డ్రైనేజీ నిర్మాణాలు తదితర అభివృద్ధి పనులను ప్రజలకు గుర్తుచేశారు. అదేవిధంగా పట్టణంలో మరో రూ.50 లక్షల వ్యయంతో డ్రైనేజీ నిర్మాణ పనులు



కూడా త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం-2 పథకం ద్వారా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలఆర్థిక సహాయం, విద్యార్థులకు తల్లి వందనం పథకం ద్వారా ప్రతి విద్యార్థికి రూ.13 వేలు అందజేస్తున్నట్లు వివరించారు.
పట్టణంలో శుభోదయం కార్యక్రమం ద్వారా అన్ని వార్డులను పరిశీలిస్తూ ప్రజల సమస్యలను గుర్తించి, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను ప్రజలు మరోసారి ఆశీర్వదించి, రాబోయే స్థానిక ఎన్నికల్లో 37 వార్డుల్లోనూ తెలుగుదేశం పార్టీ జెండా ఎగిరేలా భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, 29వ వార్డు మాజీ కౌన్సిలర్ ఇన్చార్జి అంజి , హరి, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# చేప చేపా ఏందిది?
# నన్ను గిట్టని వారు పట్టుకుంటే ఊరుకుంటానా?

- చిన్న అనుమానం... పెద్ద దర్యాప్తునకు నాంది!
- మలుపులు తిరిగిన ఎల్లమ్మ రాజు చెరువు చేపల చౌర్యం కథ
- ఒక సాధారణ కొనుగోలుదారుడి ప్రశ్న..
- నాలుగు శాఖల అధికారుల కుదుపు



**చిట్వేలి (డ్రీం టైమ్స్), జులై 28:**
కొన్ని కథలు విజిలెన్స్ రిపోర్టులతో కాదు... ఒక్క అనుమానంతోనే బయటపడతాయి. తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం చిట్వేలి మండలంలోని అతిపెద్దదైన యల్లమ్మరాజు చెరువు వ్యవహారం కూడా అదే కోవలోకి వస్తోంది. చేపలు కొనడానికి వెళ్లిన ఓ వ్యక్తికి ఎదురైన అసాధారణ పరిస్థితి ఈ మొత్తం వ్యవహారానికి మలుపు తిప్పింది. ఆ ఒక్క సంఘటన మూడు రోజుల్లోనే రెవెన్యూ, ఫిషరీస్, ఇరిగేషన్, పోలీస్ శాఖలను కదిలించడమే కాకుండా చివరికి రాజకీయ వర్గాల దృష్టిని కూడా ఆకర్షించింది

**ఒక్క నిరాకరణతో మొదలైన వివాదం**
చెరువు వద్ద చేపల విక్రయానికి వెళ్లిన ఓ వ్యక్తి కిలో రూ.150 ధరకు ఒప్పుకుని కొనుగోలు చేయడానికి సిద్ధమయ్యాడు. కానీ అక్కడే ట్విస్ట్... విక్రేతలు కొనే వ్యక్తి కోరుకున్న చేపలు ఇవ్వడానికి నిరాకరించారు. అదే క్షణం అనుమానానికి బీజం పడింది.
కొద్దిసేపటికే సోషల్ మీడియాలో"యల్లమ్మరాజు చెరువులో అక్రమ చేపల వేట"అనే ఆరోపణలు వైరల్ అయ్యాయి. అక్కడి నుంచే ఈ వివాదం వేగంగా విస్తరించింది.

**వాట్సాప్ చర్చల నుంచి అధికారుల టేబుళ్ల వరకు**
వాట్సాప్ గ్రూపుల్లో ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది. కొందరు తమ వద్ద అన్ని అనుమతులు ఉన్నాయని వాదించగా, మరికొందరు ఆధారాలు చూపాలని సవాలు విసిరారు. మాటల యుద్ధం తీవ్రత పెరగడంతో ఫిర్యాదులు నేరుగా అధికారుల దృష్టికి చేరాయి.
నాలుగు శాఖల దర్యాప్తు... వెలుగులోకి కీలక నిజాలు

**దర్యాప్తులో ఒక్కో శాఖ ఒక్కో కీలక అంశాన్ని స్పష్టం చేసింది:**
- **హసీల్దార్ నరసింహారావు:** అనుమతులు లేకుండా చేపల వేట పూర్తిగా చట్టవిరుద్ధం.
- **ఇరిగేషన్ డీఈ వినోద్:** ప్రస్తుతం చెరువుకు ఎలాంటి లీజు అమల్లో లేదు.
- **ఫిషరీస్ అధికారి బిందు మాధవి:** జలపుత్రుల లీజు 2026 జూన్‌తో ముగిసింది. పునరుద్ధరణ జరగాల్సి ఉంది.
- **సీఐ డి. శ్రీనివాసులు, ఎస్ఐ వినోద్ కుమార్:** శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు.

ఈ ప్రకటనలతో అసలు వివాదం కొత్త దిశలోకి మళ్లింది. లీజు లేదని తెలిసిన వెంటనే చెరువులోకి యానాదులు చేపలు వేటకు దిగారు.
లీజు గడువు ముగిసిందని స్పష్టత రావడంతో సమీప గ్రామాల ఎస్టీ యానాదులు తమ వలలతో చెరువులో చేపల వేట ప్రారంభించారు. అయితే ఇంతకాలం వేట సాగించినవారు వారిని అడ్డుకోవడంతో ఉద్రిక్తతలు చెలరేగాయి. స్థానికుల మద్దతుతో పరిస్థితి మరింత వేడెక్కింది.

**చెరువు గట్టుపై పోలీసుల జోక్యం...**
పరిస్థితి మంగళవారం ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగంలోకి దిగారు. తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షలు, పోలీస్ స్టేషన్‌లో చర్చల అనంతరం సీఐ డి. శ్రీనివాసులు ఇరువర్గాలతో మాట్లాడి తాత్కాలిక పరిష్కారం సాధించారు. లీజు పునరుద్ధరణ జరిగే వరకు చేపల వేట నిలిపివేయాలని స్పష్టం చేశారు. అలాగే యానాదులు వేసిన వలలను తొలగించి, పట్టిన చేపలను తీసుకెళ్లాలని సూచించారు.

**చెరువు వివాదానికి రాజకీయ రంగు...**
వివాదం క్రమంగా రాజకీయ రంగు పులుముకుంది. కోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు చెరువు వద్దకు చేరుకుని ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. చెరువులు ప్రజల ఆస్తులని, అక్రమ చేపల వేటపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో ఈ వ్యవహారం రాజకీయ చర్చకు దారి తీసింది. దీనిపై స్పందించిన జనసేన నాయకుడు ఆనాల సునీల్ వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం తగదన్నారు.

**ముగింపు:**
ఒక చిన్న అనుమానం... పెద్ద వ్యవస్థను కదిలించిన కథ ఇది. చెరువు గట్టుపై చేపలు కొనడానికి వెళ్లిన ఓ వ్యక్తి నిరాశతో వెనుదిరిగిన క్షణం... యల్లమ్మరాజు చెరువు చరిత్రలోనే పెద్ద చర్చకు నాంది పలికింది. ఒక చిన్న అనుమానం నాలుగు శాఖలను కదిలించింది... చివరికి రాజకీయ వేదికల దాకా చేరింది. ఇప్పుడు ఈ చెరువు కథలో చేపల కంటే ప్రశ్నలే ఎక్కువగా తేలుతున్నాయి.

## ఐజీసీ రాష్ట్రస్థాయి శిబిరానికి చిట్వేలు
# ఎన్‌సీసీ క్యాడెట్ అక్షయ ఎంపిక

**చిట్వేలు, జూలై 28 (డ్రీమ్ టైమ్స్):**
తిరుపతి జిల్లా చిట్వేలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్ అక్షయ ఐజీసీ (ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్) రాష్ట్రస్థాయి శిబిరానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు, ఎన్‌సీసీ అధికారి పసుపుల రాజశేఖర్ ఆమెను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి ఫైరింగ్ పోటీలకు అక్షయ ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఎన్‌సీసీ, క్రీడలు వంటి రంగాల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. ఎన్‌సీసీ అధికారి పసుపుల రాజశేఖర్ మాట్లాడుతూ, ఈ నెల 29 నుంచి ఆగస్టు 7 వరకు



విజయవాడ సమీపంలోని తాడేపల్లిలో జరిగే ఐజీసీ శిబిరానికి అక్షయ ఎంపికైనట్లు తెలిపారు. గత రెండు నెలలుగా కడప, తిరుపతి ప్రాంతాల్లో నిర్వహించిన కఠినమైన ఎంపిక పరీక్షల్లో ప్రతిభ కనబరిచి, ఫైరింగ్ విభాగం జూనియర్ వింగ్‌లో రాష్ట్రస్థాయి శిబిరానికి అర్హత సాధించినట్లు వివరించారు. ఈ శిబిరంలో ప్రతిభ కనబరిచిన క్యాడెట్లకు తదుపరి ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి తల్ సైనిక్ క్యాంప్‌లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఎంపికైన ఎన్‌సీసీ క్యాడెట్లు ఈ శిబిరంలో పాల్గొననున్నారు. అక్షయ ఎంపిక పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు అభినందనలు తెలిపారు.

# బిజినెస్

## భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు.. కొనుగోలుదారులకు ఊరట

**హైదరాబాద్, జూలై 28**

బంగారం, వెండి కొనుగోలు చేయాలనుకునే వారికి శుభవార్త. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మంగళవారం బంగారం, వెండి ధరలు గణనీయంగా తగ్గాయి. గత కొన్ని రోజులుగా హెచ్చుతగ్గులకు లోనవుతున్న పసిడి ధరలు తాజాగా దిగివచ్చాయి. దీంతో వివాహాలు, శుభకార్యాలు, పెట్టుబడుల కోసం బంగారం కొనుగోలు చేయాలని భావిస్తున్న వారికి కొంత ఉపశమనం లభించింది. మార్కెట్ వర్గాల వివరాల ప్రకారం, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,550 తగ్గి రూ.1,32,150కు చేరుకుంది. అదే విధంగా 24 క్యారెట్ల 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ.750 తగ్గి రూ.1,44,170 వద్ద కొనసాగుతోంది. బంగారం ధరల్లో నమోదైన ఈ తగ్గుదలతో నగల దుకాణాల వద్ద కొనుగోలుదారుల రద్దీ పెరిగే అవకాశముందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. అటు వెండి ధర కూడా భారీగా తగ్గింది. కిలో వెండి ధర ఒక్కరోజులోనే రూ.5,000 మేర పతనమై రూ.2,35,000కు చేరుకుంది. వెండి ఆభరణాలు, పూజా సామగ్రి, పారిశ్రామిక అవసరాల కోసం వెండిని కొనుగోలు చేసే వారికి ఈ ధరల తగ్గుదల



ప్రయోజనం చేకూరనుంది. బులియన్ మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరల్లో చోటుచేసుకుంటున్న మార్పులు, అమెరికా డాలర్ మారకం విలువ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, కేంద్ర బ్యాంకుల బంగారం నిల్వలు, దేశీయ డిమాండ్ వంటి అంశాలు ధరలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంటాయి. ఈ కారణంగానే బంగారం, వెండి ధరలు రోజువారీగా హెచ్చుతగ్గులకు లోనవుతుంటాయని వారు పేర్కొంటున్నారు. మరోవైపు, తెలుగు రాష్ట్రాల్లో బంగారం, వెండి ధరలు నగరం, ప్రాంతం, జీఎస్టీ, మేకింగ్ ఛార్జీలు, స్థానిక మార్కెట్ పరిస్థితులను బట్టి స్వల్పంగా మారే అవకాశం ఉంది. వినియోగదారులు కొనుగోలు చేసే ముందు స్థానిక బులియన్ మార్కెట్ లేదా నగల దుకాణాల్లో తాజా ధరలను తెలుసుకోవాలని వ్యాపారులు సూచిస్తున్నారు. ధరలు తగ్గిన నేపథ్యంలో రాబోయే రోజుల్లో బంగారం, వెండి కొనుగోళ్లు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా వివాహాలు, శుభకార్యాల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని పలువురు వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకునే అవకాశం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.

## స్వల్ప లాభాలతో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు




**ముంబై,**

: దేశీయ ఈక్విటీ మార్కెట్లు మంగళవారం ట్రేడింగ్‌ను స్వల్ప లాభాలతో ప్రారంభించాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు, విదేశీ పెట్టుబడిదారుల కదలికలు, అంతర్జాతీయ చమురు ధరలు, డాలర్ సూచీలో మార్పుల ప్రభావంతో మార్కెట్ సూచీలు ప్రారంభ సెషన్‌లో పరిమిత శ్రేణిలోనే కదలాడాయి. ఉదయం ట్రేడింగ్ ప్రారంభంలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) ప్రధాన సూచీ నిఫ్టీ 3 పాయింట్లు పెరిగి 23,996 వద్ద ట్రేడవుతోంది. మరోవైపు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) సెన్సెక్స్ 17 పాయింట్లు లాభపడి 76,846 వద్ద కొనసాగుతోంది. కీలక రంగాలకు చెందిన షేర్లలో కొనుగోళ్లతో సూచీలు స్వల్ప లాభాల్లో కొనసాగుతున్నప్పటికీ, పెట్టుబడిదారులు అప్రమత్త ధోరణి అవలంబిస్తున్నట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల విషయానికి వస్తే, అమెరికా డాలర్ ఇండెక్స్ 101.44 వద్ద కొనసాగుతోంది. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర 87.1 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా, యూఎస్ 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ ఈల్డ్ 4.63 శాతానికి చేరుకుంది. ఈ పరిణామాలను ప్రపంచ పెట్టుబడిదారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. దేశీయ కరెన్సీ రూపాయి కూడా స్వల్పంగా బలపడింది. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.68 వద్ద నమోదైంది. రూపాయి బలపడటం దిగుమతుల వ్యయంపై కొంత సానుకూల ప్రభావం చూపే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక పెట్టుబడిదారుల దృష్టి కంపెనీల త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల కొనుగోళ్లు--అమ్మకాలు, అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలపై కేంద్రీకృతమై ఉంది. ఈ అంశాల ఆధారంగా మార్కెట్‌లో రోజంతా హెచ్చుతగ్గులు కొనసాగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## బియ్యం ధరలకు మళ్లీ రెక్కలు.. కిలోపై రూ.5 నుంచి రూ.12 వరకు పెంపు

**హైదరాబాద్,**

నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో బియ్యం ధరలు కూడా సామాన్యులకు భారంగా మారుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ రకాల బియ్యం ధరలు గత నెల రోజులుగా క్రమంగా పెరుగుతుండగా, ప్రస్తుతం కిలోకు రూ.5 నుంచి రూ.12 వరకు పెరిగినట్లు వ్యాపారులు వెల్లడిస్తున్నారు. దీంతో కుటుంబాల నెలవారీ ఖర్చు మరింత పెరిగే పరిస్థితి ఏర్పడింది. వ్యాపారుల వివరాల ప్రకారం, నెల రోజుల క్రితం ఉన్న ధరలతో పోలిస్తే బియ్యం రకాన్ని బట్టి 25 కిలోల బస్తాపై రూ.200 నుంచి రూ.300 వరకు పెరుగుదల నమోదైంది. ముఖ్యంగా సన్నబియ్యం, మధ్యస్థ రకాల బియ్యం, ప్రీమియం బ్రాండ్ల ధరలు ఎక్కువగా పెరిగినట్లు తెలుస్తోంది. డిమాండ్ పెరగడం, నిల్వల వ్యయం, రవాణా ఖర్చులు వంటి కారణాలు ధరల పెరుగుదలకు దారితీశాయని వ్యాపార వర్గాలు




చెబుతున్నాయి. ధరల పెరుగుదల ప్రభావం మధ్యతరగతి, పేద కుటుంబాలపై అధికంగా పడుతోంది. ప్రతి నెలా పెద్ద మొత్తంలో బియ్యం కొనుగోలు చేసే కుటుంబాలకు ఈ పెరుగుదల అదనపు ఆర్థిక భారం మోపుతోంది. ముఖ్యంగా గృహ వినియోగంతో పాటు హోటళ్లు, మెస్‌లు, క్యాటరింగ్ రంగాలపై కూడా ధరల ప్రభావం కనిపిస్తోంది. ఇదిలా ఉండగా, సామాన్యులకు అందుబాటు ధరల్లో బియ్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆగస్టు 1 నుంచి రైతు బజార్లు, రైస్ మిల్లుల వద్ద ప్రత్యేక విక్రయ కౌంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ కౌంటర్ల ద్వారా మార్కెట్ ధరల కంటే తక్కువ ధరలకు నాణ్యమైన బియ్యాన్ని అందించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ చర్యలతో బియ్యం ధరలు కొంతవరకు నియంత్రణలోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే మార్కెట్ పరిస్థితులు, సరఫరా, డిమాండ్‌ను బట్టి రాబోయే రోజుల్లో ధరల్లో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. వినియోగదారులు బియ్యం కొనుగోలు చేసే ముందు స్థానిక మార్కెట్‌లో తాజా ధరలను తెలుసుకోవాలని సూచిస్తున్నారు.

# స్పోర్ట్స్

## గంభీర్‌కు భారీ షాకిచ్చిన బీసీసీఐ..

### - ఇద్దరు సహాయక కోచ్‌లు ఔట్..!

భారత పురుషుల జట్టు కోచింగ్ యూనిట్‌లో రెండు వికెట్లు పడ్డాయి. శ్రీలంక పర్యటనకు ముందే ఇద్దరు సహాయక కోచ్‌ల సేవలకు ఎండ్ కార్డ్ పడింది. ప్రధాన కోచ్ గౌతం గంభీర్ ఏరికోరి తీసుకున్న రియాన్ టెన్ డస్కేట్ వైదొలిగాడు. ఫీల్డింగ్ కోచ్‌గా సేవలందిస్తున్న టి.దిలీప్ కాంట్రాక్ట్ కూడా ముగిసింది. ఐర్లాండ్, ఇంగ్లండ్ చేతిలో వైట్‌వాష్ అనంతరం డస్కేట్ సమర్పించిన రాజీనామా లేఖను మంగళవారం భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆమోదించింది. అలానే దిలీప్‌ను కూడా సాగనంపింది బీసీసీఐ. దాంతో.. టీమిండియాతో వీరికున్న అనుబంధం ముగిసింది.టీమిండియా సహాయక కోచ్ పదవి నుంచి రియాన్ డస్కేట్ తప్పుకున్నాడు. బీసీసీఐతో రెండేళ్ల కాంట్రాక్టు ముగియడంతో పాటు వ్యక్తిగత కారణాలతో అతడు ఇక కొనసాగవద్దనే నిర్ణయానికి రావడమే అందుకు కారణం. ఇదే విషయాన్ని డస్కేట్ ప్రధాన కోచ్ గౌతం గంభీర్,



బీసీసీఐకు అతడు తెలియజేశాడు. బీసీసీఐ కూడా అతడి సేవలు ఇక చాలు అనుకుంది. అలానే.. రాహుల్ ద్రవిడ్ కోచ్‌గా ఉన్నప్పటి నుంచి ఫీల్డింగ్ కోచ్‌గా వ్యవహరిస్తున్న టి.దిలీప్‌ను సైతం వదులుకుంది భారత బోర్డు. శ్రీలంక పర్యటనకు ముందే వీరిద్దరూ వైదొలగడం భారత జట్టుకు కొంత ఇబ్బందికరమే.


**ఐపీఎల్ టు టీమిండియా**

నెదర్లాండ్స్ మాజీ ఆటగాడైన డస్కేట్ రెండేళ్ల క్రితం భారత జట్టు సహాయక కోచ్‌గా చేరాడు. ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ కోచింగ్ సిబ్బందిలో ఒకడైన అతడిని గౌతం గంభీర్ తన బృందలో చేర్చుకున్నాడు. టెస్టు, వన్డే ఫార్మాట్లు ఎలా ఉన్నా టీ20ల్లో టీమిండియా గొప్పగా ఆడింది.స్వదేశంలో టీ20 వరల్డ్‌కప్ గెలుపొందిన భారత్... ఆపై పసికూన ఐర్లాండ్ చేతిలో వైట్‌వాష్‌కు గురైంది. దాంతో, ఆటగాళ్లపైనే కాదు కోచింగ్ సిబ్బందిపైనా తీవ్ర విమర్శలు వచ్చాయి. ఇంగ్లండ్‌తో తొలి వన్డే జరుగుతుండగానే అసిస్టెంట్ కోచ్ రియాన్ టెన్ డస్కేట్ రాజీనామా వార్త వెలుగులోకి వచ్చింది.డస్కేట్ కుటుంబం లండన్‌లో నివసిస్తోంది. అతడికి ముగ్గురు పిల్లలు. ఉద్యోగం చేస్తూ పిల్లలను చూసుకోవడం అతడి భార్యకు కష్టంగా మారింది. దాంతో, పిల్లలలతో ఎక్కువ సమయం గడపాలనే ఉద్దేశంతో డస్కేట్ కోచింగ్ పదవిని వదులుకునేందుకు సిద్ధమయ్యాడు. టీమిండియా మ్యాచ్‌ల కోసం.. తరచూ ప్రయాణాలు చేయాల్సి రావడంతో.. ఇకపై లండన్‌లోనే ఉంటూ కోచింగ్ కెరీర్ కొనసాగించాలని అనుకుంటున్నాడు.

## కంబ్యాక్ కోసం సూర్యకుమార్ కసరత్తు.

### - కేవలం 3 గంటల్లో 1000 బంతులు ఎదుర్కొని షాక్ ఇచ్చిన 'స్కై'!

టీమిండియా స్టార్ బ్యాటర్, మాజీ టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మరోసారి తన పట్టుదలను ప్రపంచానికి చాటిచెప్పాడు. ఇటీవల జాతీయ జట్టులో చోటు కోల్పోయిన ఈ డైనమిక్ బ్యాటర్ ఏమాత్రం నిరాశ చెందకుండా తిరిగి ఫామ్‌లోకి రావడమే లక్ష్యంగా కఠిన సాధన కొనసాగిస్తున్నాడు. కేవలం మూడు గంటల వ్యవధిలోనే ఏకంగా 1000 బంతులను ఎదుర్కొని అందరినీ ఆశ్చర్యపరిచాడు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారి అభిమానుల ప్రశంసలు అందుకుంటోంది. ప్రపంచ క్రికెట్‌లో "మిస్టర్ 360 డిగ్రీస్"గా గుర్తింపు తెచ్చుకున్న సూర్యకుమార్ యాదవ్ గత కొంతకాలంగా బ్యాట్‌తో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. కీలక టోర్నీల్లో భారత జట్టుకు ఎన్నో విజయాలు అందించిన స్కై, ఇటీవల ఐపీఎల్‌తో పాటు అంతర్జాతీయ మ్యాచ్‌ల్లోనూ వరుస వైఫల్యాలను ఎదుర్కొన్నాడు. దీంతో సెలెక్టర్లు అతడిని జింబాబ్వే



పర్యటనకు ఎంపిక చేయలేదు.సూర్య స్థానంలో యువ ఆటగాళ్లకు అవకాశం కల్పించిన టీమిండియా జింబాబ్వేపై సిరీస్‌ను కైవసం చేసుకోవడంతో, జట్టులోకి తిరిగి రావాలంటే తన ఆటలో గణనీయమైన మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందని సూర్యకుమార్ గుర్తించాడు. అప్పటి నుంచి అతడు మరింత కసితో సాధన ప్రారంభించాడు. ముంబైలోని వసూ పరాంజపే క్రికెట్ అకాడమీలో సూర్యకుమార్ గంటల తరబడి శ్రమిస్తున్న వీడియో ఇప్పుడు నెట్టింట సంచలనంగా మారింది. ముందుగా ఫిట్‌నెస్ కోసం వేగంగా పరుగులు తీసిన ఆయన, అనంతరం నెట్స్‌లో నిరంతరంగా బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు.ఈ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసిన సూర్యకుమార్... "ఆదివారం చాలా అద్భుతంగా గడిచింది. వేగంగా పరుగులు తీశాను. మూడు గంటల్లో వెయ్యి బంతులు ఆడాను. ఇప్పుడు చాలా సంతృప్తిగా ఉంది" అంటూ క్యాప్షన్ ఇచ్చాడు.ఈ పోస్ట్‌కు క్షణాల్లోనే వేలాది లైక్‌లు, కామెంట్లు వచ్చాయి. "ఇదే నిజమైన అంకితభావం", "కంబ్యాక్ లోడింగ్", "స్కై మళ్లీ సూర్యుడిలా ప్రకాశిస్తాడు" అంటూ అభిమానులు కామెంట్లతో ఉత్సాహపరుస్తున్నారు.ఒకప్పుడు ఐసీసీ టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచిన సూర్యకుమార్ యాదవ్, ఇప్పుడు అదే స్థాయిలో తిరిగి రాణించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఫిట్‌నెస్‌తో పాటు బ్యాటింగ్ టెక్నిక్‌ను కూడా మెరుగుపర్చుకునేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాడు. క్రికెట్ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఫామ్ తాత్కాలికమే అయినా క్లాస్ శాశ్వతం. సూర్యకుమార్ తన పాత టచ్ అందుకుంటే ప్రత్యర్థి బౌలర్లకు మళ్లీ చుక్కలు చూపించడం ఖాయమని వారు అభిప్రాయపడుతున్నారు.

## పాక్‌ను దెబ్బతీసిన జస్టిన్ గ్రీవ్స్

### 5 మెయిడిన్లు.. 5 వికెట్లు..




**తారౌబా**

పాకిస్థాన్‌తో జరుగుతున్న టెస్టు మ్యాచ్‌లో.. వెస్టిండీస్ బౌలర్ జస్టిన్ గ్రీవ్స్ సత్తా చాటాడు. అతను వరుసగా అయిదు ఓవర్లు వేసి.. అయిదు వికెట్లు తీసుకున్నాడు. ఆ ఓవర్లలో ఒక్క పరుగు ఇవ్వకుండా మెయిడిన్స్ వేశాడు. తారౌబాలో జరుగుతున్న తొలి టెస్టులో.. పాక్ తన తొలి ఇన్నింగ్స్‌లో 282 రన్స్‌కు ఆలౌటైంది. మూడో రోజు మొత్తం 14 వికెట్లు పడ్డాయి. పాకిస్థాన్ బౌలర్ అబ్బాస్ నాలుగు వికెట్లు తీయడంతో వెస్టిండీస్ తన రెండో ఇన్నింగ్స్ ఆట ముగిసే సమయానికి ఏడు వికెట్ల నష్టానికి 126 రన్స్ మాత్రమే చేసింది. ప్రస్తుతం వెస్టిండీస్ 155 పరుగుల ఆధిక్యంలో ఉన్నది. పాక్ బ్యాటర్ మసూద్ తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ నమోదు చేశాడు. 64 నుంచి 72 ఓవర్ల మధ్య గ్రీవ్స్ అయిదు ఓవర్లలో ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా 5 వికెట్లు తీసుకున్నాడు. టెస్టు క్రికెట్ చరిత్రలో అయిదు మెయిడిన్లు వేసిన అయిదు వికెట్లు తీయడంతో ఇదే తొలిసారి. గతంలో స్టువార్ట్ బ్రాడ్ ఓ సారి వరుసగా 4 ఓవర్లు వేసి 4 వికెట్లు తీసుకున్నాడు. ఇప్పుడు అతని రికార్డును గ్రీవ్స్ బ్రేక్ చేశాడు.

# ప్రశాంత్ నీల్ హారర్ మూవీ వాయిదా.. రిలీజ్ ఎప్పుడంటే..!




మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో రూపొందుతున్న హారర్ థ్రిల్లర్ '418' కోసం ఎదురుచూస్తున్న సినీ అభిమానులకు స్వల్ప నిరాశ ఎదురైంది. జూలై 31, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కావాల్సిన ఈ చిత్రాన్ని వాయిదా వేస్తున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని వెల్లడించిన మైత్రీ మూవీ మేకర్స్, సినిమా విడుదలను వాయిదా వేస్తున్నామని తెలిపింది. అయితే ఈ నిర్ణయం వెనుక ఉన్న కారణాలను మాత్రం వెల్లడించలేదు. త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని అభిమానులకు హామీ ఇచ్చింది.ప్రస్తుతం చిత్రబృందం విడుదల వాయిదాకు సంబంధించి ఎలాంటి అధికారిక కారణం చెప్పలేదు. దీంతో సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు, విజువల్ ఎఫెక్ట్స్, సాంకేతిక అంశాలు లేదా విడుదల ప్రణాళికలో మార్పుల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నారా అనే చర్చ సినీ వర్గాల్లో సాగుతోంది. అయితే ఈ అంశాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. '418' ఒక ఇంటెన్స్ హారర్ థ్రిల్లర్‌గా రూపొందుతోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార సామగ్రి సినిమాపై ఆసక్తిని పెంచింది. ముఖ్యంగా సస్పెన్స్, భయానక అంశాలతో కథను తెరకెక్కిస్తున్నట్లు ప్రచారం జరుగుతుండటంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఈ చిత్రంలో ప్రీతి పగడాల కథానాయికగా నటిస్తున్నారు. ఆమెతో పాటు చరణ్ లక్కరాజు, సూర్య రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. కొత్త తరహా కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ప్రతి పాత్రకూ కథలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రానికి మరో ప్రధాన ఆకర్షణ దర్శకుడు ప్రశాంత్ నీల్ మద్దతు. ఆయన ఈ ప్రాజెక్ట్‌కు అనుబంధంగా ఉండటం వల్ల 418 పై ప్రారంభం నుంచే మంచి బజ్ ఏర్పడింది. ఆయన పేరు జత కావడంతో సినిమా స్థాయిపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ చిత్రానికి కీర్తన్ నాదగౌడ దర్శకత్వం వహిస్తుండగా, వెంకీ జీజీ సంగీతం అందిస్తున్నారు. హారర్‌తో పాటు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌ను సమపాళ్లలో మేళవిస్తూ దర్శకుడు సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. విడుదల వాయిదా పడినప్పటికీ, సినిమా విడుదలపై చిత్రబృందం పూర్తి నమ్మకంతో ఉంది. కొత్త విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని మైత్రీ మూవీ మేకర్స్ స్పష్టం చేసింది. దీంతో అభిమానులు ఇప్పుడు కొత్త రిలీజ్ డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.


# దేశ విభజన నేపథ్యంలో సన్నీ డియోల్ 'బట్వారా 1947'.. ట్రైలర్ రిలీజ్!




బాలీవుడ్ యాక్షన్ స్టార్ సన్నీ డియోల్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ హిస్టారికల్ డ్రామా 'బట్వారా 1947' (దీఘ్ఝుతీఝు 1947) నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. తాజాగా ఈ సినిమా నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. దేశ విభజన నాటి భయానక పరిస్థితులు, ద్వేషం మధ్య ఒక వ్యక్తి చూపించిన అసాధారణ ధైర్యం నేపథ్యంలో సాగే భావోద్వేగభరిత చిత్రంగా ఈ చిత్రం రాబోతున్నట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. ఇక ఈ చిత్రాన్ని స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా 2026, ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.గతంలో 'ఘాయల్', 'దామిని', 'ఘాతక్' వంటి ఇండస్ట్రీ హిట్లను అందించిన స్టార్ డైరెక్టర్ రాజ్‌కుమార్ సంతోషి, సన్నీ డియోల్ కాంబినేషన్‌లో చాలా ఏళ్ల తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను మిస్టర్ పర్ఫెక్ట్ ఆమిర్ ఖాన్ తన 'ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండటం విశేషం. ఈ చిత్రంలో సన్నీ డియోల్ సరసన సీనియర్ స్టార్ హీరోయిన్ ప్రీతి జింతా నటిస్తుండగా, శబానా అజ్మీ, అలీ ఫజల్, కరణ్ డియోల్, కనికా కపూర్, సర్గమ్ సింగ్, ఖుషీ హజారే కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ గ్రహీత ఎ.ఆర్. రెహమాన్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు.

# ది ప్యారడైజ్'లో కీర్తి సురేష్ మాస్ స్టెప్పులు ..

### నాని-శ్రీకాంత్ ఓదెల సినిమాలో స్పెషల్ సాంగ్‌పై హాట్ టాక్!



నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం ది ప్యారడైజ్ పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరి కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో సినిమాకు సంబంధించిన ఓ వార్త ఇప్పుడు ఫిలింనగర్‌లో చర్చనీయాంశంగా మారింది. తాజా ప్రచారం ప్రకారం, ఈ చిత్రంలో ఉండే ఓ హై-వోల్టేజ్ మాస్ స్పెషల్ సాంగ్ కోసం జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేష్‌ను తీసుకోవాలని మేకర్స్ ఆలోచిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై ఇప్పటివరకు చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ ప్రచారం నిజమైతే నాని, కీర్తి సురేష్ కాంబినేషన్ మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. గతంలో వీరిద్దరూ కలిసి నటించిన 'నేను లోకల్' మంచి విజయాన్ని అందుకుంది. అనంతరం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వచ్చిన దసరాస లోనూ ఈ జంట మరోసారి ఆకట్టుకుని బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసింది. ఇప్పుడు అదే దర్శకుడు తెరకెక్కిస్తున్న ది ప్యారడైజ్ లో కీర్తి సురేష్ ప్రత్యేక గీతంలో కనిపించే అవకాశం ఉందనే వార్త అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ చిత్రానికి సంగీత దర్శకుడిగా అనిరుధ్ రవిచందర్ పని చేస్తున్నారు. ఇప్పటికే ఆయన అందించిన పాటలు దేశవ్యాప్తంగా భారీ ఆదరణ పొందుతున్నాయి. ఒకవేళ కీర్తి సురేష్ స్పెషల్ సాంగ్‌లో కనిపిస్తే, అనిరుధ్ మాస్ బీట్‌కు ఆమె డ్యాన్స్ మరో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే అవకాశముందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కీర్తి సురేష్ తెలుగు ప్రేక్షకులకు 'నేను శైలజ' సినిమాతో పరిచయమయ్యారు. తొలి చిత్రంతోనే తన సహజ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమె, తర్వాత మహానటి లో సావిత్రి పాత్రను అద్భుతంగా పోషించి జాతీయ ఉత్తమ నటి అవార్డును అందుకున్నారు. ఆ తర్వాత 'సర్కారు వారి పాట', 'భోళా శంకర్' వంటి పెద్ద చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. కమర్షియల్ చిత్రాలతో పాటు నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను కూడా సమానంగా ఎంపిక చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం కీర్తి సురేష్ పలు క్రేజీ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. విజయ్ దేవరకొండ సరసన తెరకెక్కుతున్న 'రౌడీ జనార్ధన్' చిత్రంతో పాటు, దర్శకుడు అనిల్ రావిపూడి రూపొందిస్తున్న వెంకటేష్--కళ్యాణ్ రామ్ మల్టీస్టారర్ చిత్రంలో కూడా ఆమె కథానాయికగా నటిస్తున్నారు. ఈ క్రమంలో ది ప్యారడైజ్ లో స్పెషల్ సాంగ్ చేసే అవకాశం ఉందనే ప్రచారం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# క్యారవాన్‌లోకి వచ్చి చొక్కా విప్పేశాడు..

### షూటింగ్ సెట్‌లో చేదు అనుభవాన్ని గుర్తుచేసుకున్న కాజల్!

ప్రముఖ కథానాయిక కాజల్ అగర్వాల్ షూటింగ్ సెట్‌లో తనకు ఎదురైన ఒక భయంకరమైన సంఘటనను గుర్తుచేసుకుంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఓ సినిమా షూటింగ్ పూర్తయ్యాక తాను క్యారవాన్‌లో విశ్రాంతి తీసుకుంటుండగా, అదే చిత్రంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఒక వ్యక్తి ఎలాంటి అనుమతి తీసుకోకుండా, కనీసం తలుపు కూడా కొట్టకుండా లోపలికి వచ్చేశాడని ఆమె తెలిపారు. ఆ తర్వాత అతడు వెంటనే తన చొక్కా విప్పి, ఛాతీపై ఉన్న కాజల్ పేరు టాటూను చూపించాడని, ఆ హఠాత్ పరిణామానికి తన కాళ్లు చేతులు వణికిపోయాయని కాజల్ వెల్లడించారు. అభిమానంతో టాటూ వేయించుకోవడం సంతోషమే అయినా, ఒక మహిళ ఒంటరిగా ఉన్నప్పుడు అనుమతి లేకుండా క్యారవాన్‌లోకి రావడం ఏమాత్రం సరికాదని ఆమె అభిప్రాయపడ్డారు. ఎంత పెద్ద అభిమాని అయినా ఇటువంటి ప్రవర్తనను ఎంతమాత్రం సహించలేమని, ఇలాంటి పనులు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు అవుతాయని హెచ్చరించి అతడిని అక్కడి నుంచి పంపించి వేసినట్లు కాజల్ చెప్పారు. 2004లో హిందీ చిత్రం 'క్యూన్! హో గయా నా'తో అరంగేట్రం చేసిన కాజల్, ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన 'మగధీర' చిత్రంతో స్టార్ హీరోయిన్‌గా మారిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత డార్లింగ్, బృందావనం, మిస్టర్ పర్ఫెక్ట్, బిజినెస్‌మ్యాన్, నాయక్, బాద్‌షా, ఎవడు, టెంపర్ వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలతో అలరించడమే కాకుండా బాలీవుడ్‌లో 'సింగం', 'స్పెషల్ 26' చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఆమె నటించిన ఇండియా స్టోరీ ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చింది.



# 'రామాయణ' ట్రైలర్‌కు డేట్ ఫిక్స్?

### మళ్లీ విజువల్స్ లీక్ కావడంతో ఆందోళన



భారతీయ సినీ చరిత్రలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రాల్లో రామాయణ ఒకటి. బాలీవుడ్ స్టార్ హీరో రణబీర్ కపూర్ శ్రీరాముడి పాత్రలో, నేచురల్ బ్యూటీ సాయి పల్లవి సీతాదేవి పాత్రలో నటిస్తున్న ఈ భారీ పౌరాణిక చిత్రానికి ప్రముఖ దర్శకుడు నితీష్ తివారి దర్శకత్వం వహిస్తున్నారు. హిందీతో పాటు తెలుగు సహా పలు భారతీయ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రంపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, ప్రచార పోస్టర్లు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచగా, ఇప్పుడు సినిమా ట్రైలర్‌కు సంబంధించిన తాజా వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మొదట ఈ చిత్రం ట్రైలర్‌ను గత వారం విడుదల చేయాలని మేకర్స్ భావించినట్లు ప్రచారం జరిగింది. అయితే కొన్ని సాంకేతిక కారణాల వల్ల ట్రైలర్ విడుదల వాయిదా పడినట్లు వార్తలు వచ్చాయి.ఇప్పుడు తాజా సమాచారం ప్రకారం, జూలై 30న 'రామాయణ' ట్రైలర్‌ను డిజిటల్ వేదికగా విడుదల చేయాలని చిత్రబృందం నిర్ణయించినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు చిత్ర యూనిట్ అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో అభిమానులు అధికారిక ప్రకటన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇటీవల జరిగిన అంతర్జాతీయ కామిక్-కాన్ ఈవెంట్‌లో ప్రదర్శించిన సుమారు నిమిషన్నర నిడివి గల ప్రత్యేక ట్రైలర్ విజువల్స్ ఆన్‌లైన్‌లో లీక్ అయిన సంగతి తెలిసిందే. ఆ విజువల్స్ సోషల్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొట్టాయి. తాజాగా మరోసారి సినిమాకు సంబంధించిన కొన్ని విజువల్స్, క్లిప్‌లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. వాటిలో కనిపిస్తున్న విజువల్ క్వాలిటీ, గ్రాఫిక్స్, పాత్రల డిజైన్ చూసిన అభిమానులు సినిమాపై ప్రశంసలు కురిపిస్తున్నారు. అయితే ఈ లీక్ వీడియోలకి సంబంధించి చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.'రామాయణం' చిత్రాన్ని అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్‌తో అంతర్జాతీయ స్థాయిలో రూపొందిస్తున్నట్లు ఇప్పటికే మేకర్స్ వెల్లడించారు. లీక్ అయినట్లు ప్రచారం జరుగుతున్న విజువల్స్ కూడా అదే స్థాయిలో ఉండటంతో, ట్రైలర్ ఎలా ఉండబోతుందనే ఆసక్తి అభిమానుల్లో మరింత పెరిగింది.పౌరాణిక కథను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వెండితెరపై ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్న ఈ సినిమా భారతీయ సినీ పరిశ్రమలో కొత్త ప్రమాణాలను సృష్టిస్తుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఈ చిత్రంలో శ్రీరాముడిగా రణబీర్ కపూర్, సీతాదేవిగా సాయి పల్లవి నటించడం ప్రధాన ఆకర్షణగా మారింది. ఇద్దరూ ఈ పాత్రల కోసం ప్రత్యేకంగా సిద్ధమయ్యారని ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులు వెల్లడించారు. ముఖ్యంగా సాయి పల్లవి సీత పాత్రలో ఎలా కనిపించబోతున్నారనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది.

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831